డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
RNI NO: TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR







| తెలంగాణ Telangana | ఆదివారం Sunday | 24 - 05 -2026 24- 05 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 129 Issue: 129 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## 40 శాతం వరకు నకిలీ
# న్యాయవాదులే

దేశంలో నకిలీ లాయర్ల కలకలం.
బార్ కౌన్సిల్ సంచలన వ్యాఖ్యలు.



2

## ట్రంప్‌ను ఎగతాళి
# చేసిన ఇరాన్

బంగ్లాదేశ్ దున్నపోతుతో వ్యంగ్య పోస్టు వైరల్



2

# పాక్ ఉగ్రవాద అడ్డా

టెర్రరిస్టుల బహిరంగ హాజరు.
ఇస్లామాబాద్‌లో సంచలన ఘటన.
ప్రపంచానికి పాక్ అసలు రూపం.



**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 23:**
ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని ప్రపంచానికి పదేపదే చెబుతున్న పాకిస్థాన్ అసలు స్వరూపం మరోసారి బట్టబయలైంది. నిషేధిత ఉగ్రవాద సంస్థలకు చెందిన టాప్ టెర్రరిస్టులు ఇస్లామాబాద్‌లో బహిరంగంగా ఒక అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉగ్రవాదులకు పాకిస్థాన్ సురక్షిత కేంద్రంగా మారిందన్న ఆరోపణలకు ఈ ఘటన మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా అమెరికా ప్రకటించిన మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు ఒకేచోట కనిపించడం భద్రతా సంస్థలను అప్రమత్తం చేసింది. నిషేధిత అల్-బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన కీలక కమాండర్ అర్జుమంద్ గుల్జార్ దార్ అలియాస్ హంజా బుర్హాన్ ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించాడు. శుక్రవారం అతని అంత్యక్రియలను ఇస్లామాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్-బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ తదితర కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాకిస్థాన్‌పై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంత్యక్రియల సమయంలో ఆధునిక ఆయుధాలతో టెర్రరిస్టులు భారీ భద్రత కల్పించడం గమనార్హంగా మారింది. ఏకే-47 తుపాకులతో ముట్టడి చేసినట్లుగా భద్రత ఏర్పాటు చేయడం ద్వారా ఉగ్రవాద సంస్థలు పాకిస్థాన్‌లో ఎంత స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నాయో స్పష్టమైందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల పాకిస్థాన్‌లో పలువురు టెర్రరిస్టులు వరుసగా హత్యకు గురవుతున్న నేపథ్యంలో తమ నేతల భద్రతపై ఉగ్రవాద సంస్థలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా రత్నిపొరకు చెందిన హంజా బుర్హాన్ చట్టబద్ధమైన పత్రాలతో పాకిస్థాన్‌కు వెళ్లి అల్-బద్ర్ సంస్థలో చేరినట్లు భారత భద్రతా సంస్థలు గుర్తించాయి. 2019 పుల్వామా దాడి తర్వాత అతని పేరు ప్రధానంగా వెలుగులోకి వచ్చింది. కశ్మీర్ యువతను ఉగ్రవాద మార్గంలోకి దింపడం, పాకిస్థాన్ నుంచి నిధులు సమకూర్చడం, నియామకాలు చేపట్టడంలో అతను కీలక పాత్ర పోషించినట్లు

- మిగతా 2 లో...



# యాదాద్రిలో మహా
# ఆధ్యాత్మిక ప్రాజెక్ట్

## రూ.99 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన

తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాలకు శ్రీకారం.
తిరుమల తరహాలో యాదాద్రి అభివృద్ధికి భారీ ప్రణాళిక.
వేద విద్య, భక్తి వైభవానికి కొత్త అధ్యాయం.





**జనం వాయిస్, యాదాద్రి, మే 23:**
ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్

- మిగతా 2 లో...

## తాగునీటి సమస్యలపై
# బీఆర్ఎస్ ధర్నా

ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం ఎదుట నిరసన.
జంటనగరాల్లో నీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్.
ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన.
కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు.

02



## ప్రభుత్వ పాఠశాలలకు
# కార్పొరేట్ సంస్థల అండ

- తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి భారీ సిఎస్ఆర్ నిధులు.
- సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఎంఓయూలు.

02



## టీజీసెట్ ఫేజ్-2 ఫలితాల విడుదల

- 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు.
- జూన్ 7 వరకు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాలి.




02

## హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా
# అలర్ట్

02



వడగాల్పులతో ఏడు జిల్లాల్లో 16 మంది మృతి.
మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం.

## 40 శాతం వరకు నకిలీ
# న్యాయవాదులే

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 23:**
దేశవ్యాప్తంగా కోర్టుల్లో నల్ల కోట్లు వేసుకుని ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల్లో భారీ సంఖ్యలో నకిలీ లాయర్లు ఉన్నారంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశంలో దాదాపు 35 నుంచి 40 శాతం వరకు న్యాయవాదులు నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నారని బీసీఐ ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా వెల్లడించారు. నకిలీ డిగ్రీలను కొనుగోలు చేయడం లేదా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించడం ద్వారా పలువురు కోర్టుల్లో న్యాయవాదులుగా కొనసాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారం బార్ కౌన్సిల్ దృష్టికి వచ్చిందని, ఇప్పటికే దీనిపై ప్రత్యేక చర్యలు ప్రారంభించామని తెలిపారు. నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అరికట్టేందుకు బీసీఐ దేశవ్యాప్తంగా న్యాయవాదుల విద్యార్హతల పరిశీలన చేపట్టింది. అడ్వకేట్ల డిగ్రీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఫారాలు సమర్పించాలని కోరగా, దాదాపు 40 శాతం మంది ఇప్పటివరకు వెరిఫికేషన్ ఫారాలు నింపలేదని వెల్లడించారు. ఫారాలు సమర్పించని వారిపై బీసీఐ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ అంశాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు భంగం కలిగించే ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన "కాక్రోచ్ జనతా పార్టీ" వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. గత వారం ఒక పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కొందరు నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్నారని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. అలాంటి వారినే ఉద్దేశిస్తూ "కాక్రోచ్" అనే పదాన్ని ఉపయోగించారని స్పష్టం చేశారు. నకిలీ డిగ్రీల వ్యవహారంపై అవసరమైతే సీబీఐ దర్యాప్తు కూడా కోరే అవకాశముందని బీసీఐ వర్గాలు సూచిస్తున్నాయి. న్యాయవృత్తి పవిత్రతను కాపాడేందుకు కఠిన చర్యలు తప్పవని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ట్రంప్‌ను ఎగతాళి చేసిన ఇరాన్

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 23:**
అమెరికాఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఇరాన్ మరోసారి అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్య పోస్టుతో వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్‌లో ట్రంప్‌ను పోలి ఉన్న తెల్ల దున్నపోతుకు సంబంధించిన వీడియోను రష్యాలోని ఇరాన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో షేర్ చేస్తూ ఎగతాళి చేసింది. "ట్రంప్‌తో పోల్చడం వల్ల మనస్తాపానికి గురైన ఆ మూగజీవం ప్రస్తుతం తిండి తినడం మానేసింది" అంటూ ఇరాన్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ పోస్టుపై ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని నారాయణ్‌గంజ్ జిల్లాకు చెందిన ఈ భారీ తెల్ల దున్నపోతు ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. సుమారు 700 కిలోల బరువున్న ఈ దున్నపోతు తలపై ఉన్న జుట్టు, ముఖ ఆకృతి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉన్నాయని పలువురు నెటిజన్లు కామెంట్లు చేశారు. దీంతో దాని యజమాని సరదాగా ఆ దున్నపోతుకు "డొనాల్డ్ ట్రంప్" అని పేరు పెట్టాడు. ప్రస్తుతం బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఈ దున్నపోతును చూడటానికి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ బక్రీద్ సందర్భంగా దాన్ని బలివ్వాల్సి వస్తుందని యజమాని చెప్పడం పలువురిని నిరాశకు గురిచేస్తోంది. ఈ ఘటన అంతర్జాతీయ రాజకీయాల మధ్య మరోసారి సోషల్ మీడియా చర్చకు దారితీసింది.

# పాక్ ఉగ్రవాద అడ్డా

- మొదటిపేజీ తరువాయి...
సమాచారం. దీంతో భారత్ 2022లో అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా ప్రకటించింది. పీఓకేలోని ముజఫరాబాద్‌లో ఒక ప్రైవేట్ కాలేజీ ప్రిన్సిపల్‌గా వేరే గుర్తింపుతో జీవిస్తున్న హంజా బుర్హాన్‌ను గురువారం ఉదయం కాలేజీ గేటు వద్ద అత్యంత సమీపం నుంచి కాల్చిచంపారు. తలకు మూడు బుల్లెట్ గాయాలు కావడంతో అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పాక్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థలు బహిరంగంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయన్న ఆరోపణలకు ఈ ఘటన మరో పెద్ద ఉదాహరణగా మారింది. ఉగ్రవాదుల అంత్యక్రియలకు టాప్ టెర్రరిస్టులు బహిరంగంగా హాజరుకావడం అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. ఉగ్రవాద నిర్మూలనపై ప్రపంచ దేశాలు కఠిన వైఖరి అవలంబిస్తున్న సమయంలో ఇలాంటి ఘటనలు పాకిస్థాన్ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## తాగునీటి సమస్యలపై
# బీఆర్ఎస్ ధర్నా

**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
జంటనగరాల్లో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ శనివారం ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించింది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని అనేక కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న సమయంలో ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. నీటి కొరతతో ప్రజలు గంటల తరబడి ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాల్లో తాగునీటి సమస్య రోజురోజుకు మరింత తీవ్రమవుతోందని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. వెంటనే అన్ని ప్రాంతాలకు సమయానికి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. నీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జలమండలి కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచారు. తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.




# యాదాద్రిలో మహా ఆధ్యాత్మిక ప్రాజెక్ట్

- మొదటిపేజీ తరువాయి...
రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద సంప్రదాయ పరిరక్షణతో పాటు యాదాద్రిని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. వేద పాఠశాలతో పాటు యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. మొత్తం రూ.99.55 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు యాదాద్రి రూపురేఖలను పూర్తిగా మార్చనున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదాద్రిని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు. భక్తులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేద సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యాదాద్రి అభివృద్ధి తెలంగాణ ఆధ్యాత్మిక



చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. రూ.43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ భారీ వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల విధానంలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్య అందించనున్నారు. ఈ సముదాయంలో యాగశాలలు, హోమ మండపాలు, వేద అధ్యయన కేంద్రాలు, గోశాల వంటి ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణలో ఈ వేద పాఠశాల కీలక కేంద్రంగా నిలవనుందని పండితులు అభిప్రాయపడుతున్నారు. ఇదే కార్యక్రమంలో రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణ పనులకు కూడా భూమిపూజ జరిగింది. అలాగే కొండపై స్వామివారి నిత్య కల్యాణోత్సవాల నిర్వహణ కోసం రూ.9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం నిర్మించనున్నారు. భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యంగా వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో రక్షణ కానోపీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ.1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. యాదాద్రికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే యాదాద్రి దేశంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటిగా నిలవనుందని భావిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సంస్థల అండ

**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యారంగ బలోపేతానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల కింద రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో సచివాలయంలో పాఠశాల విద్యాశాఖతో ఈ మూడు సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి, మౌలిక వసతుల ఆధునికీకరణ కోసం ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. ఒప్పంద పత్రాలను నీల్ రహేజా, అల్లా దక్షయాణి, గోరుకంటి దేవేందర్ రావు ముఖ్యమంత్రికి అందజేశారు. రామ్‌కీ ఫౌండేషన్ మెదక్–మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్‌నగర్‌లో ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు సమగ్ర విద్యా క్యాంపస్ నిర్మాణానికి మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వాటాగా రూ.19.66 కోట్లు అందించనుంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కూడా రూ.10.4 కోట్లు కేటాయించనుంది. కే రహేజా గ్రూప్ రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్ స్థాయి వరకు విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి రూ.50.50 కోట్లు ఖర్చు చేయనుంది. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో



కూడిన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. యశోద ఫౌండేషన్ ఉప్పల్ సుభాష్‌నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రీ–ప్రైమరీ, 6వ, 7వ తరగతుల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.12.20 కోట్లు అందించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సి.శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# టీజీసీఈటీ ఫేజ్-2 ఫలితాల విడుదల




**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీసీఈటీ–2026 ప్రవేశ పరీక్ష ఫేజ్–2 ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు చీఫ్ కన్వీనర్ శారద తెలిపారు. సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈ ఫలితాలను ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ ఫేజ్–2 ఫలితాల ద్వారా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పర్గి బాలికల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, ఖమ్మం బాలుర స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో 8వ తరగతి రెగ్యులర్ ప్రవేశాల కోసం కూడా ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన వివరాలను కూడా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు తమకు కేటాయించిన విద్యాసంస్థల్లో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చీఫ్ కన్వీనర్ సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో గురుకుల విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శారద పేర్కొన్నారు. గురుకుల విద్య ద్వారా అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించాలని అధికారులు సూచించారు. ప్రవేశ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు.

# హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్

**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాల్పుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అత్యవసర అప్రమత్తత చర్యలు చేపట్టింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా సమీక్షించిన మంత్రి, వడదెబ్బ కారణంగా ఏడు జిల్లాల్లో 16 మంది మరణించినట్లు అధికారుల నివేదికల ద్వారా తెలుసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రతి మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుందని, ఎల్‌నినో ప్రభావంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా ప్రతి స్థాయిలో అప్రమత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపించాలని




అధికారులను ఆదేశించారు. మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ఎండలపై అవగాహన కల్పించాలని సూచించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి తెలిపారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ, నిర్మాణ రంగ కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా కలెక్టర్ హీట్ వేవ్ పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు ఫీల్డ్‌లో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలతో పాటు పక్షులు, జంతువుల రక్షణ కూడా ముఖ్యమని గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 26 వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతలు కొనసాగనున్నాయని మంత్రి వెల్లడించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించి అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# సంపాదకీయం

# అధిక వేడి..

## - రాబోయే కాలంలో జీవనం మరింత కష్టమా?

**జనం వాయిస్, డెస్క్, మే 23:**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఇప్పుడు సాధారణ వేసవి పరిస్థితులుగా కనిపించడం లేదు. ప్రతి ఏడాది ఎండలు మరింత తీవ్రంగా మారుతూ ప్రజల జీవనశైలిని పూర్తిగా మార్చేస్తున్నాయి. ఒకప్పుడు మధ్యాహ్న సమయంలో మాత్రమే భరించలేని వేడి ఉండేది. ఇప్పుడు ఉదయం నుంచే మండే ఎండలు మొదలై రాత్రివేళల్లో కూడా వేడి తగ్గని పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణ మార్పులు, నగరీకరణ, చెట్ల నరికివేత, పెరుగుతున్న కాలుష్యం కలిసి ఈ పరిస్థితులను మరింత ప్రమాదకరంగా మార్చుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత వాతావరణ శాఖ ఇప్పటికే అనేక రాష్ట్రాలకు తీవ్ర ఉష్ణతరంగ హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు నలభై ఐదు డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నలభై ఏడు డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో ఈ ఏడాది అత్యధికంగా నలభై



ఎనిమిది డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.

వేడి ప్రభావం కేవలం బయట తిరిగేవారిపైనే కాదు. ఇళ్లలో ఉన్నవారిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. రాత్రివేళల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగానే ఉండటంతో ప్రజలకు సరైన నిద్ర దొరకడం లేదు. గాలి తేమ పెరగడం వల్ల చెమట ఎక్కువై శరీరం త్వరగా అలసిపోతోంది. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారిపై ఈ పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధిక వేడి కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. చల్లబరిచే పరికరాల వినియోగం పెరగడంతో విద్యుత్ వ్యవస్థలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడుతోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విద్యుత్ అవసరాలు రికార్డు స్థాయికి చేరినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రంగంపైనా వేడి తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు ఎండిపోవడం, నీటి కొరత పెరగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు వస్తూ జీవనశైలిని మార్చుకుంటున్నారు.

వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్తు ప్రమాదం కాదు, ప్రస్తుత వాస్తవమనే పరిస్థితి కనిపిస్తోంది. శాస్త్రవేత్తలు చెబుతున్నట్లుగా మానవ చర్యల వల్లే ఈ తీవ్ర ఉష్ణ పరిస్థితులు మరింత పెరుగుతున్నాయి. చెట్ల సంఖ్య తగ్గిపోవడం, కాంక్రీట్ భవనాలు పెరగడం, వాహనాల కాలుష్యం అధికమవడం వల్ల నగరాలు వేడి దీవుల్లా మారుతున్నాయి. ఆరోగ్య శాఖలు కూడా ఇప్పటికే అప్రమత్తమవుతున్నాయి. వడదెబ్బ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడం, దాహ నివారణ ద్రావణాలు నిల్వ ఉంచడం, ప్రజలకు సూచనలు ఇవ్వడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఇంకా సరైన అవగాహన పూర్తిగా పెరగలేదని నిపుణులు చెబుతున్నారు. చాలామంది మధ్యాహ్న వేళల్లో కూడా బయట తిరగడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఒక్కటే. రాబోయే పదేళ్లలో పరిస్థితి ఇంకా ఎంత తీవ్రమవుతుంది? ఇప్పటికే ప్రతి ఏడాది ఎండ తీవ్రత పెరుగుతుండగా భవిష్యత్తులో జీవనం మరింత కఠినంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీరు, విద్యుత్, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి రంగాలన్నింటిపైనా వేడి ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల జీవితం మరింత భారంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటడం, నీటి వినియోగాన్ని తగ్గించడం, అవసరం లేని విద్యుత్ వినియోగాన్ని నియంత్రించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీస్తాయి. పట్టణాల్లో పచ్చదనం పెంచకపోతే భవిష్యత్తులో నగర జీవనం మరింత కష్టసాధ్యంగా మారే ప్రమాదం ఉంది. అధిక వేడి ఇప్పుడు కేవలం ఒక ఋతు సమస్య కాదు. అది ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, జీవనశైలిని ప్రభావితం చేసే పెద్ద సవాలుగా మారుతోంది. ఇప్పటికైనా ప్రకృతిని కాపాడే చర్యలు వేగంగా చేపట్టకపోతే రాబోయే తరాలకు భరించలేని పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది. వడదెబ్బ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడం, దాహ నివారణ ద్రావణాలు నిల్వ ఉంచడం, ప్రజలకు సూచనలు ఇవ్వడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఇంకా సరైన అవగాహన పూర్తిగా పెరగలేదని నిపుణులు చెబుతున్నారు. చాలామంది మధ్యాహ్న వేళల్లో కూడా బయట తిరగడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఒక్కటే. రాబోయే పదేళ్లలో పరిస్థితి ఇంకా ఎంత తీవ్రమవుతుంది? ఇప్పటికే ప్రతి ఏడాది ఎండ తీవ్రత పెరుగుతుండగా భవిష్యత్తులో జీవనం మరింత కఠినంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీరు, విద్యుత్, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి రంగాలన్నింటిపైనా వేడి ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల జీవితం మరింత భారంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటడం, నీటి వినియోగాన్ని తగ్గించడం, అవసరం లేని విద్యుత్ వినియోగాన్ని నియంత్రించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీస్తాయి. పట్టణాల్లో పచ్చదనం పెంచకపోతే భవిష్యత్తులో నగర జీవనం మరింత కష్టసాధ్యంగా మారే ప్రమాదం ఉంది. అధిక వేడి ఇప్పుడు కేవలం ఒక ఋతు సమస్య కాదు. అది ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, జీవనశైలిని ప్రభావితం చేసే పెద్ద సవాలుగా మారుతోంది. ఇప్పటికైనా ప్రకృతిని కాపాడే చర్యలు వేగంగా చేపట్టకపోతే రాబోయే తరాలకు భరించలేని పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

## సోదర బంధానికి ప్రతీకగా

# సోదరుల దినోత్సవం

**అన్నదమ్ముల ప్రేమను గుర్తు చేసే ప్రత్యేక సందర్భం.**
**చిన్ననాటి జ్ఞాపకాలను మళ్లీ తలపించే రోజు.**
**కుటుంబ అనుబంధాలను మరింత బలపరిచే ఆప్యాయత వేడుక.**




**జనం వాయిస్, డెస్క్, మే 23:**

ప్రతి కుటుంబంలో అత్యంత మధురమైన బంధాల్లో సోదర బంధం ఒకటి. ఒకే ఇంట్లో పెరిగి, ఒకే తల్లిదండ్రుల ప్రేమను పంచుకుంటూ ఎదిగే అన్నదమ్ముల అనుబంధం జీవితాంతం నిలిచే ఆప్యాయతగా మారుతుంది. అలాంటి బంధాన్ని గుర్తు చేసుకునే రోజుగా సోదరుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ రోజు కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలను మరింత దగ్గర చేస్తుంది. చిన్ననాటి నుంచి అన్న లేదా తమ్ముడు మన జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తాడు. ఆటల్లో భాగస్వామి, చదువుల్లో తోడు, తప్పు చేస్తే మందలించే వ్యక్తి, బాధలో ఓదార్పు చెప్పే మనిషిగా సోదరుడు నిలుస్తాడు. బాల్యంలో జరిగే చిన్నచిన్న గొడవలు కూడా తరువాత అందమైన జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. కుటుంబంలో సోదరులు ఉండటం అనేది ఒక భరోసా లాంటిదని పెద్దలు చెబుతుంటారు. జీవితంలో ఎలాంటి సమస్య వచ్చినా ముందుగా గుర్తుకొచ్చే వ్యక్తుల్లో సోదరుడు కూడా ఉంటాడు. ఎన్నో సందర్భాల్లో మాటలకంటే ఎక్కువగా అర్థం చేసుకునే బంధంగా ఇది నిలుస్తుంది. అందుకే ఈ అనుబంధానికి ప్రత్యేక గుర్తింపుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలితో కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాల్లో నివసించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కారణంగా అన్నదమ్ములు దూరంగా ఉన్నప్పటికీ మనసులు మాత్రం ఎప్పటికీ దగ్గరగానే ఉంటాయి. ఒక చిన్న పలకరింపు, ఒక ఆప్యాయమైన సందేశం కూడా ఈ బంధాన్ని మరింత బలపరుస్తుంది. సామాజిక మాధ్యమాల విస్తరణతో ఇప్పుడు ఈ దినోత్సవానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. చాలామంది తమ చిన్ననాటి చిత్రాలను పంచుకుంటూ సోదరులపై ఉన్న ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రత్యేక కానుకలు అందిస్తుండగా, మరికొందరు కలిసి గడిపే సమయాన్నే గొప్ప బహుమతిగా భావిస్తున్నారు. సోదర బంధం కేవలం కుటుంబ పరిమితుల్లోనే కాదు, వ్యక్తిత్వ వికాసంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. చిన్నప్పటి నుంచి కలిసి పెరగడం వల్ల పరస్పర సహకారం, బాధ్యత, గౌరవం వంటి విలువలు సహజంగానే అలవడతాయి. ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటూ జీవితంలో ముందుకు సాగుతారు. చాలా సందర్భాల్లో తల్లిదండ్రులు లేని సమయంలో కుటుంబ బాధ్యతలను అన్నదమ్ములే పంచుకుంటారు. కష్టసమయాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ కుటుంబాన్ని కాపాడే శక్తిగా మారుతారు. అందుకే సోదర బంధాన్ని సమాజంలో అత్యంత విలువైన సంబంధాల్లో ఒకటిగా భావిస్తారు. పిల్లల పెంపకంలో కూడా సోదర బంధం ఎంతో ప్రభావం చూపుతుంది. ఒంటరితనం తగ్గి, పంచుకోవడం అనే గుణం పెరుగుతుంది. చిన్నతనంలో కలిసి గడిపిన సమయం తరువాత జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలుస్తుంది. అందుకే చాలామంది తమ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ ఈ రోజును ఆనందంగా జరుపుకుంటారు. మన సంస్కృతిలో కుటుంబ బంధాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పెద్దలను గౌరవించడం, చిన్నవారిని ప్రేమించడం వంటి విలువలు కుటుంబాల ద్వారా తరతరాలకు చేరుతున్నాయి. అందులో సోదరుల అనుబంధం కూడా ముఖ్యమైనదే. ప్రేమ, నమ్మకం, సహకారం అనే భావాలను ఈ బంధం ప్రతిబింబిస్తుంది. ప్రపంచం ఎంత వేగంగా మారినా కుటుంబ బంధాల విలువ మాత్రం ఎప్పటికీ తగ్గదు. జీవిత ప్రయాణంలో ఎన్నో మార్పులు వచ్చినా సోదరుల మధ్య ఉన్న ఆప్యాయత చిరస్థాయిగా నిలుస్తుంది. అలాంటి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేమను పంచుకునే రోజుగా సోదరుల దినోత్సవం ప్రతి కుటుంబానికి ప్రత్యేకతను తీసుకొస్తోంది.



# కామన్‌వెల్త్ దినోత్సవం ప్రాధాన్యం

**దేశాల ఐక్యతకు ప్రతీకగా ప్రత్యేక సందర్భం.**
**సాంస్కృతిక బంధాలను గుర్తు చేసే వేడుక.**
**పరస్పర సహకారానికి నిదర్శనంగా నిలిచిన దినం.**

**జనం వాయిస్, డెస్క్, మే 23:**

ప్రపంచంలోని అనేక దేశాల మధ్య స్నేహం, ఐక్యత, పరస్పర సహకారాన్ని బలపరిచే ముఖ్యమైన సందర్భంగా కామన్‌వెల్త్ దినోత్సవాన్ని భావిస్తారు. ఈ రోజు సభ్య దేశాల మధ్య ఉన్న చారిత్రక అనుబంధాలను గుర్తు చేస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమానత్వం, శాంతి, అభివృద్ధి వంటి లక్ష్యాలతో కలిసి ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ దినం ప్రపంచానికి తెలియజేస్తుంది. కామన్‌వెల్త్ అనేది పలు దేశాల సమాఖ్యగా ఏర్పడిన వేదిక. భిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు కలిగిన దేశాలు ఒకే వేదికపై కలసి పనిచేయడం దీని ప్రత్యేకతగా చెప్పబడుతుంది. పరస్పర గౌరవం, స్నేహభావం ఆధారంగా ఈ సమాఖ్య కొనసాగుతోంది. సభ్య దేశాలు విద్య, వాణిజ్యం, క్రీడలు, సాంకేతిక రంగాల్లో సహకారం అందించుకుంటున్నాయి. ఈ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, చర్చా కార్యక్రమాలు, యువతకు సంబంధించిన ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. సభ్య దేశాల సంప్రదాయాలను పరిచయం చేస్తూ కళా ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తారు. వివిధ దేశాల ప్రజలు ఒకరికొకరు సంస్కృతులను అర్థం చేసుకునే అవకాశం ఈ వేడుకల ద్వారా లభిస్తుంది. ప్రపంచంలో శాంతి, స్థిరత్వం కొనసాగాలంటే దేశాల మధ్య స్నేహ సంబంధాలు ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. అలాంటి భావనను బలపరిచే వేదికగా కామన్‌వెల్త్ గుర్తింపు పొందింది. విభిన్నతలో ఏకత్వం అనే భావనను ఈ సమాఖ్య ప్రతిబింబిస్తుంది. భౌగోళికంగా దూరంగా ఉన్న దేశాలు కూడా ఒక కుటుంబంలా కలిసి పనిచేయగలవని ఇది నిరూపిస్తోంది. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కూడా కామన్‌వెల్త్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో ఈ వేదిక ఉపయోగపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. క్రీడల రంగంలో కూడా కామన్‌వెల్త్ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. సభ్య దేశాల మధ్య నిర్వహించే క్రీడా పోటీలు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని కలిగిస్తాయి. క్రీడల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రపంచానికి చూపించే అవకాశం ఈ పోటీల ద్వారా లభిస్తోంది. సామాజిక అభివృద్ధి, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో కూడా సభ్య దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. పేదరిక నిర్మూలన, విద్యాభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల వంటి అంశాలపై పరస్పరం సహకారం అందించుకుంటున్నాయి. ప్రపంచ సమస్యలకు కలిసికట్టుగా పరిష్కారాలు వెతకడం ఈ సమాఖ్య లక్ష్యాల్లో ఒకటిగా నిలుస్తోంది. సాంకేతిక రంగంలో వేగంగా జరుగుతున్న మార్పులను సభ్య దేశాలు పరస్పరం పంచుకుంటున్నాయి. కొత్త ఆవిష్కరణలు, పరిశోధనల ద్వారా అభివృద్ధి దిశగా కలిసి అడుగులు వేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఇతర సభ్య దేశాలకు సాంకేతిక సహాయం అందించడం ద్వారా పరస్పర ప్రగతికి తోడ్పడుతున్నాయి. ప్రపంచంలో పెరుగుతున్న విభేదాల మధ్య ఐక్యత ఎంతో అవసరమని కామన్‌వెల్త్ దినోత్సవం గుర్తు చేస్తోంది. దేశాల మధ్య స్నేహం, గౌరవం, సహకారం ఉంటేనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఈ రోజు సందేశం ఇస్తోంది. భిన్న సంస్కృతులు కలిగిన ప్రజలు కూడా కలిసి జీవించగలరనే విషయాన్ని ఈ వేదిక చాటిచెబుతోంది. ప్రపంచ అభివృద్ధికి దేశాల మధ్య సహకారం ఎంత ముఖ్యమో తెలియజేసే సందర్భంగా కామన్‌వెల్త్ దినోత్సవం నిలుస్తోంది. పరస్పర విశ్వాసం, స్నేహం, సమానత్వం వంటి విలువలను గుర్తు చేస్తూ ఈ రోజు ప్రతి సభ్య దేశానికి ప్రత్యేక గుర్తింపుగా మారింది.

# గుంతకల్‌లో బీజేపీ విజయ లక్ష్యం

అనంతపురం పర్యటనలో పార్టీ కార్యాలయ సందర్శన.
కార్యకర్తలతో సమావేశమైన బండి సంజయ్.
క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చ.
మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం కేడర్‌కు పిలుపు.

**జనం వాయిస్, అనంతపురం, మే 23:**
కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా శనివారం గుంతకల్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశమై క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు చేస్తున్న కృషిని అభినందించారు.



పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆత్మీయంగా మాట్లాడిన బండి సంజయ్, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కేడర్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుంతకల్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరేయాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని బండి సంజయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసంతో పనిచేస్తే గుంతకల్‌లో బీజేపీకి మరింత బలం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు గుంతకల్ ప్రాంత రాజకీయ పరిస్థితులు, పార్టీ విస్తరణపై బండి సంజయ్‌కు వివరాలు అందించారు. బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో గుంతకల్ మున్సిపాలిటీలో బీజేపీ విజయానికి కృషి చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు.

# తెలంగాణ పోలీసింగ్‌కు ఏఐ టెక్నాలజీ

ఆధునిక వ్యవస్థల అనుసంధానంపై డీజీపీ సమీక్ష.
స్మార్ట్ పోలీసింగ్ కోసం ప్రత్యేక టెక్ టీమ్ ఏర్పాటు.
సీసీటీఎన్ఎస్, హెచ్‌ఆర్ఎంఎస్ సమగ్ర అనుసంధానం.
ప్రజలకు వేగవంతమైన సేవల లక్ష్యంగా చర్యలు.

**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థను మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికత వైపు కీలక అడుగులు వేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలను పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించేందుకు రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉన్న సీసీటీఎన్ఎస్, హెచ్‌ఆర్ఎంఎస్, హాక్ఐ వంటి డిజిటల్ వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసే అంశంపై అధికారులు సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్ శాఖలో డేటా సమన్వయం, నేరాల విశ్లేషణ, సిబ్బంది నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. ఆధునిక టెక్నాలజీ సహాయంతో నేర నియంత్రణను మరింత బలోపేతం చేయడంతో పాటు విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని డీజీపీ సూచించారు. ఈ క్రమంలో ప్రత్యేక టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసి వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థను దేశంలోనే అత్యాధునికంగా తీర్చిదిద్దే దిశగా సాంకేతిక మార్పులు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. హాక్ఐ యాప్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను మరింత విస్తరించడంతో పాటు పోలీస్ శాఖ అంతర్గత వ్యవస్థలను కూడా డిజిటల్ పద్ధతుల్లో సమగ్రపరచాలని సమావేశంలో సూచించారు. పోలీస్ శాఖలో పారదర్శకత, వేగం, సమన్వయం పెంచడంలో ఈ ఆధునిక విధానాలు కీలకంగా మారనున్నాయని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ పోలీసింగ్ అమలుకు తెలంగాణ పోలీస్ శాఖ ఇప్పటికే పలు ఆధునిక కార్యక్రమాలు చేపట్టిందని, ఇప్పుడు ఏఐ సాంకేతికతతో మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కార్యాచరణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.




# రైతులకు ఆధునిక సాంకేతికత

వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాల ప్రారంభం.
డ్రోన్లు, రోబోటిక్స్ పరిశోధనలపై మంత్రి ప్రశంసలు.
మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుపై సూచనలు.
నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడుల లక్ష్యం.



**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన విత్తన వారోత్సవాలు2026 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన మూల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముందు మంత్రి విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీని సందర్శించారు. డ్రోన్ల వినియోగంపై జరుగుతున్న పరిశోధనలు, భవిష్యత్ వ్యవసాయ రంగంలో వాటి ప్రాధాన్యంపై శాస్త్రవేత్తలతో చర్చించారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరత పెరుగుతున్న నేపథ్యంలో డ్రోన్ ఆధారిత వ్యవసాయ పద్ధతులు రైతులకు ఎంతో



ఉపయోగకరమని పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన రోబోటిక్స్, సెన్సార్ ఆధారిత ప్రయోగశాలను కూడా మంత్రి పరిశీలించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే విధంగా రోబోలను అభివృద్ధి చేయడాన్ని అభినందించారు. అలాగే ఆర్ఎస్ అండ్ జీఐఎస్ ప్రయోగశాలలో ఉపగ్రహ ఆధారిత గణాంకాలపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ భూమిలో సుమారు 9.3 శాతం భూమి సాగులో లేదని అధికారులు మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విత్తన వారోత్సవాలు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడంలో కీలకమని మంత్రి అన్నారు. కొన్ని ప్రైవేటు విత్తన సంస్థల మాయ మాటలకు మోసపోకుండా రైతులు విశ్వవిద్యాలయం అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని పిలుపునిచ్చారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలను పాటించాలని మంత్రి సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆధునిక సాంకేతికతలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడంలో విశ్వవిద్యాలయం ముందుండాలని అన్నారు. రైతులతో నిరంతరం మమేకమై వారి సమస్యలకు పరిష్కారాలు అందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య, పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠీ బలరామ్, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై. చంద్ర మోహన్ తదితర శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ పాలన ఉదాహరణ

- 2014 నుంచి 2023 వరకు ఆర్థిక ప్రగతిలో దూసుకెళ్లిన రాష్ట్రం.
- రాష్ట్ర ఆదాయంలో 37 శాతం వృద్ధి నమోదు.
- తలసరి ఆదాయం రూ.3.47 లక్షలకు పెరిగిన తెలంగాణ.
- ఐసీఏఐ కాన్వొకేషన్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు.

**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
2014 నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఐసీఏఐ కాన్వొకేషన్ 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం 37 శాతం పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఆర్థిక వనరుల పెంపుతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమైందన్నారు. సంక్షేమం, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధి సమన్వయంతో తెలంగాణ దేశంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. 201314లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.97 వేలుగా ఉండగా, 202324 నాటికి అది రూ.3,47,299కు పెరిగిందని కేటీఆర్ వెల్లడించారు. దేశంలో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో నిలిచిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితమే ఈ ప్రగతని తెలిపారు. స్టార్టప్ రంగంలో కూడా తెలంగాణ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. పదేళ్లలోనే భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందన్నారు. యువతకు అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం అనేక ప్రోత్సాహక విధానాలు అమలు చేసిందని వివరించారు. పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయం, మౌలిక




వసతుల రంగాల్లో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కేటీఆర్ అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలు తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా గుర్తించాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణం ప్రజల సహకారంతో సాధ్యమైందని కేటీఆర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా కృషి కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఐసీఏఐ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా సన్నాహాలు

- మే 25 నుంచి 31 వరకు ఘనంగా నిర్వహణ.
- మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యమన్న మంత్రి సీతక్క.
- సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సీఎం చేతుల మీదుగా ప్రారంభం.
- మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక కార్యక్రమాలు.
- మంత్రి సీతక్క.

**జనం వాయిస్, హైదరాబాద్, మే 23:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, విద్యా పురోగతి వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా వారోత్సవాల నిర్వహణ, కార్యక్రమాల షెడ్యూల్, ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా సామాజికంగా మరింత శక్తివంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంటును ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళా సంఘాల ఆర్థిక శక్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 25న రాష్ట్రంలోని 100 గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించనున్నారు. అదే రోజు 8 వేల గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 82 అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ప్రారంభించి, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు పంపిణీ చేయనున్నారు. జిల్లా స్థాయిలో లోన్ మేళాలు కూడా నిర్వహించనున్నారు. 26వ తేదీన మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 553 ఆర్టీసీ బస్సులను ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. హైదరాబాద్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించడంతో పాటు బాల్య వివాహాల నిరోధానికి “బాల్య వివాహం బతుకు ఆగం” పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా భద్రత, పోష్ చట్టంపై అవగాహన సదస్సులు, మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫార్మ్‌ల పంపిణీ వంటి పలు కార్యక్రమాలు కూడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్నారు. మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపేలా నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. మహిళా సాధికారతకు కొత్త దిశా నిర్దేశం చేసేలా ప్రతి కార్యక్రమం ఉండాలని పేర్కొన్నారు.



డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM RNI NO:TGTEL/26/A0383

# ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిరణ్ సేవలు ప్రశంసనీయం.

**దేశ ప్రగతికి ప్రామాణికమైన డేటా అందించడంలో కిరణ్ నిస్వార్ధ సేవ వెలకట్టలేనిది.**



**గార్ల /జనం వాయిస్ :**
ఎండ తీవ్రతను ఏమాత్రం లెక్కచేయకుండా భానుడి భగభగలను ఎదుర్కొంటూ చిన్నకిష్టాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కిరణ్ జనగణన సర్వేను ఎంతో అంకితభావంతో విజయవంతం చేస్తున్నారు. మే 11 నుండి జూన్ 10 వరకు నెల రోజులపాటు నిర్వహిస్తున్న జన గణన సర్వే ఎన్యూమరేటర్ గా దేశ్యతండ, మంగలితండ గ్రామాలలో 230 ఇండ్లు, 300 కుటుంబాల సర్వే చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడమే కాకుండా,దేశానికి అత్యంత కీలకమైన జనాభా గణన ప్రక్రియలో కష్టపడి పని చేయడం అభినందనీయం. బోధనా రంగంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించడం ఆయన అంకిత భావాన్ని, దేశభక్తిని చాటి చెబుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న వేళ ఎండతీవ్రత, వడగాలులను సైతం లెక్కచేయకుండా ప్రతి ఇంటి తలుపులు తట్టి వివరాలు సేకరిస్తున్నారు.కొందరు ప్రజలు వివరాలు చెప్పడానికి నిరాకరించడం, అందుబాటులో లేకపోవడం వంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ ఓపికగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. జన గణన సర్వే లో తన అంకిత భావాన్ని, ఓపికను ప్రశంసిస్తూ ప్రజలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు అభినందనలు తెలుపుతున్నారు.

# గంజాయి నియంత్రణకు జైపూర్‌లో పోలీసుల మెరుపుదాడి

**కమిషనరేట్ ఆదేశాలతో ముమ్మర సోదాలు.**
**జైపూర్ పరిధిలో రంగంలోకి స్పెషల్ వింగ్స్.**



**జనం వాయిస్, మంచిర్యాల, మే 23:**
యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా జైపూర్ పరిధిలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి మహమ్మారిని రూపుమాపడమే ధ్యేయంగా రంగంలోకి దిగిన యాంటీ నార్కోటిక్స్ వింగ్ ప్రత్యేక బృందాలు, డాగ్ స్క్వాడ్‌తో కలిసి జైపూర్ పరిధిలోని కీలక ప్రాంతాలను జల్లెడ పట్టాయి. ముఖ్యంగా రద్దీగా ఉండే బస్టాండ్లు, హోటళ్లు, అనుమానాస్పదంగా ఉన్న పాన్ షాపుల్లో అణువణువూ ఆకస్మిక దాడులు నిర్వహించి క్షుణ్ణంగా సోదాలు చేపట్టారు. సమాజానికి ముప్పుగా మారిన నిషేధిత వస్తువులు, మత్తు పదార్థాలను విక్రయించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి గంజాయి వంటి మత్తు పదార్థాల వ్యాపారానికి పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తును, ముఖ్యంగా యువతను మత్తు రక్కసి బారి నుండి కాపాడటమే ప్రధాన లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, ఇటువంటి ఆకస్మిక తనిఖీలు రాబోయే రోజుల్లోనూ నిరంతరాయంగా కొనసాగుతాయని వెల్లడించారు. మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనకు ప్రజలు, యువత కూడా పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు

# పోతిరెడ్డిపల్లి గ్రామంలో తాడిచెట్లు దగ్ధం.

**ఉపాధిని కోల్పోయిన గీత కార్మికుడు**



**జనం వాయిస్, జమ్మికుంట, మే 23:**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి వ్యవసాయ పొలంలో కొయ్య కాల అంటి పెట్టి వెళ్లారు ఆ మంటలు వ్యాపిస్తూ వృత్తినే దైవంగా జీవనం సాగించే ఉపాధిగా బతికే గీత కార్మికులు చేపూరి శ్రీకాంత్ గౌడ్ యొక్క కల్లువారే తాడి చెట్లు కాలి బూడిదవడంతో వృత్తినే జీవనోపాధిగా బతికే అతను తాడి చెట్లు కాలిపోవడంతో జీవన ఉపాధి కోల్పోయానని చెట్టును పట్టుకొని ఏడుస్తున్న చేపూరు శ్రీకాంత్ గౌడ్ నా ఉపాధి లేక నేను తాడిచెట్లు కోలిపోయానని బాధతో కృంగిపోయాడు ఇతనిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని తోటి గౌడస్తులు కోరారు.



# రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి రమేష్ డిమాండ్
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు.
- వడ్ల కేంద్రాల వద్ద ఎండలోనే పడికాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు.



**జనం వాయిస్, మంచిర్యాల, మే 23:**
ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు సకాలంలో సాగకపోవడంతో, అన్నదాతలు ఈ కరుడుగట్టే ఎండల్లో కొనుగోలు కేంద్రాల వద్దే పడికాపులు కాయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని మండలాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఈ సందర్భంగా కోడి రమేష్ తీవ్రంగా ఆరోపించారు. ఎమ్మెల్యే వస్తున్నారంటే చాలు... ఇక్కడి స్థానిక నాయకులు రైతుల సమస్యలను గాలికొదిలేసి, వారి కోసం దావత్‌లు (విందులు) ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారని విమర్శించారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా, విందుల కోసం మేకలు, పొట్టేలను బలి ఇవ్వడానికి కార్యాచరణలు రూపొందించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులకు, పాలకులకు రైతుల కన్నీళ్లు కనబడడం లేదా అని ఆయన ధ్వజమెత్తారు.

# కులగణనపై సుప్రీంకోర్టు తీర్పుకు బీసీ సమాజ్ హర్షం.

**కేంద్రానికి కీలక డిమాండ్**

- కులగణన వ్యతిరేకులకు ఈ తీర్పు చెంపపెట్టు: నరెడ్ల శ్రీనివాస్.
- కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశవ్యాప్తంగా ఓబీసీ లెక్కింపు చేపట్టాలని డిమాండ్.

**జనం వాయిస్ మంచిర్యాల, మే 23:**
జనగణనలో బీసీ కులగణన చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని, ఇది కులగణన వ్యతిరేకులకు చెంపపెట్టు లాంటిదని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలని ఎన్నో ఏళ్లుగా చేస్తున్న పోరాట ఫలితమే ఈ తీర్పు అని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో నెలకొన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలను సరిచేయడానికి, ప్రభుత్వాలు సరైన సంక్షేమ విధానాలు రూపొందించడానికి కులాల వారీగా ఖచ్చితమైన గణాంకాలు అత్యంత అవసరమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేయడాన్ని ఆయన స్వాగతించారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని నరెడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో కులగణన చేస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేయాలని చూసిందని విమర్శించిన ఆయన, ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ప్రస్తుతం దేశంలో జరుగుతున్న కుటుంబాల లెక్కింపు ప్రక్రియలోనే బీసీ కుటుంబాల వివరాలను కూడా నమోదు చేసేలా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ జనాభా లెక్కలను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించడం పట్ల ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు



# కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన వొడితల ప్రణవ్.

**జనం వాయిస్, జమ్మికుంట, మే 23:**
కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త తన కుటుంబంగా భావించి,కార్యకర్తలకు ఆపద వస్తే ముందుండి ఆ కుటుంబానికి పెద్ద దిక్కులాగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ నిలబడ్డారని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.శనివారం రోజున ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మహమ్మద్ సలీం పాషా కుటుంబానికి యాభై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రణవ్ జమ్మికుంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనుకాగా వారిని నాయకులు ఓదార్చారు.అనంతరం వారు మాట్లాడుతూ మాలో ఒకడిగా ఉన్న సలీం పాషా మరణం బాధాకరమని,కార్యకర్తలకు భరోసాను ఇస్తూ హుజూరాబాద్ ఇంచార్జి ప్రణవ్ బాబు కుటుంబానికి అండగా నిలబడడం ద్వారా కష్ట సమయంలో కుటుంబానికి అండగా మానవతావాదిగా ఉంటారని తెలియజేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మండే ఎండలకు మరో ప్రాణం బలి

**జమ్మికుంటలో వడదెబ్బకు వృద్ధుడి మృతి**



**జనం వాయిస్, జమ్మికుంట, మే 23:**
జమ్మికుంట పట్టణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుండగా, తీవ్ర ఎండలు మరో ప్రాణాన్ని బలితీసుకున్న విషాద ఘటన వెూతక్కాలగూడెంలో చోటుచేసుకుంది. వడదెబ్బ కారణంగా వృద్ధుడు మృతి చెందడంతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని 11వ వార్డుకు చెందిన గల్లి లింగయ్య (65) శుక్రవారం పని నిమిత్తం మండుటెండలో మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురై పడుకున్నాడు. సాయంత్రం అయినా ఇంటి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా ఆయన తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు.ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించగా అప్పటికే లింగయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాదం.

**వడ దెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి.**

**జనం వాయిస్, కాళేశ్వరం, మే 23:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాద ఘటన చోటుచేసుకుంది. వడదెబ్బతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తేడ కాళేశ్వరంలోని ఇప్పల్ బోరు సమీపంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని బాధితుడిని 108 వాహనంలో తరలించి పరీక్షించగాడ అప్పటికే వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి వివరాలు వెల్లడించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతని గురించి సమాచారం తెలిసిన వారు 8712658115 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.



# ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి.

**ఉపాధి హామీ పనుల్లో రక్షణ మరిచిన అధికారులు.**
**అధికారులు చూపిస్తున్న రక్షణ చర్యలు కాగితాలకే పరిమితం.**
**మండుటెండల్లో విలవిల్లాడుతున్న ఉపాధి కూలీలు.**



**గార్ల /జనం వాయిస్ :**
గ్రామీణ పేద కుటుంబాలకు కనీస జీవనోపాధిని కల్పించడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరుపేద కూలీల పాలిట శాపంగా మారుతుంది. మండల పరిధిలోని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలో త్రాచుపాములకుంట, పిల్లి కుంటలలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులు అరకొర సౌకర్యాల నడుమ పని చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.మండుటెండల్లో చెరువులు, కుంటలు, కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు ఎండలకు విలవిల్లాడుతున్నారు. కూలీలు సేదతీరెందుకు కనీసం నీడ కూడా ఏర్పాటు చేయలేదు.పని ప్రదేశంలో కనీసం త్రాగునీటి సౌకర్యం కూడా కరువైంది. చట్ట ప్రకారం పని ప్రదేశాల్లో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు అమలు కావడం లేదు. కూలీలకు ఉపాధి అయితే చూపించారు కానీ వారికి రక్షణ కల్పించడం మరిచిపోయారు.అధికారులు చూపిస్తున్న రక్షణ చర్యలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల ప్రకారం పని ప్రదేశంలో కూలీల కోసం టెంట్లు, త్రాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలి కానీ ఇవేమీ పట్టనట్లు అధికారులు గాలికోదిలేశారు. ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సులు, మెడికల్ కిట్లు, త్రాగునీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.పని ప్రదేశంలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. మండల అధికారులు తక్షణమే పని ప్రదేశాలను సందర్శించి ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.



# జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## - పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి.

**జనం వాయిస్,హుజురాబాద్ మే 23:**
ప్రభుత్వం రాయితీపై అందించే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హుజురాబాద్ పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం రైతులకు వ్యవసాయ శాఖ అధికారి భూమ్ రెడ్డి తో కలసి జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీలుగ విత్తనాలను పంట పొలంలో వేసుకుని 45 రోజుల తర్వాల కలియ దున్నడం వల్ల పంట దిగుబడి పెరగడంతో పాటు భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఏవో భూమ్ రెడ్డి మాట్లాడుతూ... 30 కేజీల జీలుగ విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తామని తెలిపారు. మండలానికి 250 క్వింటాళ్లు కేటాయించారని, 30 కేజీల బస్తా ధర రూ.2,452.లుగా నిర్ణయించారని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకుని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి పర్మిట్ పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల్, డీసీఎంఎస్ ఇంఛార్జి రమేష్ ఉన్నారు.



# వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు మజ్జిగ వితరణ

**జనం వాయిస్, జమ్మికుంట, మే 23:**
ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని జమ్మికుంట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల కోసం వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శనివారం రోజున అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఎండాకాలం తీవ్రత ఎక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో భక్తులకు మజ్జిగ దాత కల్వల దీప్తి కిషన్ రెడ్డి సహకారంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డి వర్మకు "భారతరత్న" ప్రకటించాలి

- భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు భావితరాలకు చేరవేయాలి.
- తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్.

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
తొలి తెలుగు దళిత కిరణం, సంగమాన్యుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలను మానుకోటలోని స్థానిక లయన్స్ క్లబ్‌లో తెలంగాణ మల్ల యోధుల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ మాదరి భాగ్యరెడ్డి వర్మ కేవలం నాయకుడు మాత్రమే కాకుండా దళిత, బహుజన సమాజానికి ఆత్మగౌరవాన్ని నేర్పిన మహోన్నత సామాజిక విప్లవకారుడని అన్నారు. నిజాం పాలన కాలంలోనే అంటరానితనం, కుల వివక్ష, సామాజిక అసమానతలపై పోరాటం ప్రారంభించి అణగారిన వర్గాల్లో చైతన్య జ్యోతిని వెలిగించిన మహనీయుడని కొనియాడారు. ఆది హిందూ ఉద్యమం ద్వారా దళితులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో భాగ్యరెడ్డి వర్మ విశేష కృషి చేశారని తెలిపారు. "చదువులేని సమాజం ఎప్పటికీ బానిసత్వంలోనే ఉంటుంది" అనే భావనతో పేద పిల్లల కోసం పాఠశాలలు స్థాపించి వేలాది మందికి విద్య అందించారని పేర్కొన్నారు. మహిళా విద్య, బాల్య వివాహాల నిర్మూలన, మద్యపాన నిషేధం వంటి సామాజిక సంస్కరణల కోసం కూడా భాగ్యరెడ్డి వర్మ పోరాడారని గుర్తుచేశారు. నేటి యువత మహనీయుల చరిత్రను అధ్యయనం చేసి సమాజానికి ఉపయోగపడే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళిత, బహుజన సమాజంలో ఆత్మగౌరవం, విద్యా చైతన్యం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ మల్ల యోధుల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ దళిత, బహుజన సమాజ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు "శ్రీ మాదరి భాగ్యరెడ్డి వర్మ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్"గా నామకరణం చేయాలని కోరారు. భారతదేశ దళితోద్యమానికి, సామాజిక న్యాయ సాధనకు, విద్యా చైతన్యానికి విశిష్ట సేవలు అందించిన భాగ్యరెడ్డి వర్మకు కేంద్ర ప్రభుత్వం "భారతరత్న" ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మల్ల యోధుల సమితి ప్రధాన కార్యదర్శి మందడి ఇజ్రాయిల్, కోశాధికారి బల్లెం శ్రీనివాస్, బద్దెపూరి వెంకటయ్య, నీరుడు సామెల్, కొమ్ము ముల్సార్, సూర్నపు ముత్తయ్య, జంగం రామ నర్సయ్య, పాల్, మంద సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.




# మరిపెడకు చెందిన డా.బానోతు కృష్ణ నాయక్‌కు బీజేపీలో కీలక పదవి.

బీజేపీ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది.
బీజేపీ గిరిజన మోర్చ రాష్ట అధికార ప్రతినిధి భానోత్(బుల్లెట్)క్రిష్ణ నాయక్.



**మరిపెడ (మే 23) జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన డా.బానోతు(బుల్లెట్)కృష్ణ నాయక్‌కు బీజేపీలో అరుదైన గౌరవం దక్కింది.ఆయనను బీజేపీ ఎస్టీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ రాష్ట్ర పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు సూచనల మేరకు,ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ ఈ నియామకాలు చేశారు.డోర్నకల్ నియోజకవర్గం,మరిపెడ పట్టణం చోక్ల తండాకు చెందిన డా.బానోతు కృష్ణ నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు.తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఆయన,సామాజిక సేవ,గిరిజన సంక్షేమం కోసం ఎప్పటి నుంచో కృషి చేస్తున్నారు.నియామకం అనంతరం డా.కృష్ణ నాయక్ మాట్లాడుతూ,తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి మరియు పార్టీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నానని తెలిపారు.రాష్ట పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ,పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటు,పార్టీ విధానాలకు అనుగుణంగా నడుచుకుంటానని అన్నారు.బీజేపీ పార్టీలో కష్ట పడినవారిని పార్టీ గుర్తించి వారి కష్టానికి తగ్గ పదవులను వారిని పార్టీ గౌరవిస్తుందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదని అన్నారు.తెలంగాణలోనూ బీజేపీ డబల్ ఇంజన్ సర్కార్ ను తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తాము అని ఆయన స్పష్టం చేశారు.ఈ నియామకంతో మరిపెడ మండలానికి,గిరిజన నాయకులకు గర్వకారణంగా మారిందని స్థానిక నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్లా**




**మహబూబాబాద్ / జనం వాయిస్:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్లా ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, "వికసిత్ భారత్" కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. అలాగే కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తికాకపోవడం బాధాకరమని తెలిపారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బానోత్ ఉక్లా డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రింబవళ్లు కాపలా కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు రైతులు మృతి చెందారని, మృతి చెందిన రైతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతన్నల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని బానోత్ ఉక్లా ప్రభుత్వాలను కోరారు.

# రైతులను నిలువునా ముంచుతున్న వడ్ల కొనుగోలు సెంటర్లు.

**అక్రమాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి.**
**బీసీ జేఏసీ చైర్మన్ సిద్ధి రమేష్ యాదవ్.**

**జనం వాయిస్, చెన్నూరు, మే 23:**
చెన్నూరు మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులను తీవ్రంగా దోపిడీ చేయడం బాధ కలిగిస్తోంది. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తుంటే, అక్కడి నిర్వాహకులు అనేక అక్రమాలకు పాల్పడుతూ రైతులను నిలువునా ముంచుతున్నారని బీసీ జేఏసీ చైర్మన్ సిద్ధి రమేష్ యాదవ్ తీవ్రంగా ఆరోపించారు. వడ్ల కొనుగోలు సమయంలో రైతులకు ట్రక్ సీడ్ ఇవ్వకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయడం అత్యంత అన్యాయమని ఆయన పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని తరలించడానికి భారీ ఖర్చులు భరిస్తున్నప్పటికీ, ట్రక్ సీడ్ ఇవ్వకుండా కొనుగోలు చేయడం. హమాలి ఖర్చులు రైతులే భరించడం వల్ల రైతులకు అదనపు భారం అవుతుంది. అంతేకాకుండా ప్రతి 40 కిలోల బస్తాకు ఐదు కిలోల వరకు అక్రమంగా కటింగ్ చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విధంగా తరుగుదల పేరుతో రైతుల శ్రమను దోచుకోవడం దారుణమని ఆయన అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ఉన్నతాధికారులు మాత్రం ఈ అక్రమాలను చూసీ చూడనట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ విధానాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, మధ్యవర్తులు మరియు కొంతమంది నిర్వాహకుల వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుండి అక్రమంగా ఐదు కిలోల తరుగుదల చేస్తున్న సిబ్బందిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని కోరారు. అదేవిధంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో పారదర్శకంగా తూకాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు సరైన రసీదులు ఇవ్వాలని సూచించారు. రైతు దేశానికి వెన్నెముక అని ప్రతి ప్రభుత్వం చెబుతుంటే, క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మాత్రం రోజురోజుకూ దయనీయంగా మారుతోందన్నారు. రైతుల కష్టానికి తగిన గౌరవం ఇవ్వకపోతే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇకనైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేకపోతే రైతు సంఘాలు మరియు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సిద్ధి రమేష్ యాదవ్ హెచ్చరించారు.



# జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రధానోపాధ్యాయురాలు గిరిజ సూచించారు. శనివారం సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా పీఎం శ్రీ కంబాలపల్లి పాఠశాలలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు గిరిజ విద్యార్థులకు జీవవైవిధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవాలని, చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా భూమిని పర్యావరణ కాలుష్యం నుంచి రక్షించడంతో పాటు జీవవైవిధ్యాన్ని సంరక్షించగలమని తెలిపారు. అనంతరం డ్రాయింగ్ మాస్టర్ అంబరీష్ ఆధ్వర్యంలో "జీవవైవిధ్య పరిరక్షణ" అంశంపై చిత్రలేఖన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో సుమారు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.




# ప్రైవేట్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయ కార్యవర్గం ఎన్నిక..!

## డివిజన్ అధ్యక్షులుగా సిహెచ్ శ్రీనివాస్ యాదవ్

**జనం వాయిస్.హుస్నాబాద్, మే 23:**
సిద్దిపేట జిల్లా ప్రయివేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జిల్లా ఉపాధ్యక్షులు కంటే రాజు , మరియు జిల్లా కోశాధికారి వేల్పుల వెంకటస్వామి సమక్షంలో హుస్నాబాద్ డివిజన్ ప్రయివేట్ వ్యాయామ విద్య అసోసియేషన్ కార్యవర్గ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది అందులో బాగంగా అసోసియేషన్ అధ్యక్షులుగా సిహెచ్ శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షులుగా అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి. రాజిరెడ్డి, కోశాధికారి సిహెచ్ సంపత్, జాయింట్ సెక్రటరీ కే లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ రాజేష్, లను మరియు కార్యవర్గ సభ్యులు గా వంశీ కృష్ణా, మహేష్, వంశీ, అజయ్ లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.



# మంచినీటి సమస్యపై సిపిఎం వినతి

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
మహబూబాబాద్ మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలో నల్లాల ద్వారా మంచినీరు ఆరు రోజులకు ఒకసారి మాత్రమే వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం నాయకులు తెలిపారు. గతంలో ఒక రోజు విడిచి మరో రోజు నీటి సరఫరా జరిగేదని, అయితే గత 15 రోజులుగా 5 నుంచి 6 రోజులకు ఒకసారి మాత్రమే కొద్దిసేపు నీరు విడుదల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై శనివారం సిపిఎం 18వ వార్డు శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సమస్యపై స్పందించిన కమిషనర్ రెండు రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేపడతామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యుడు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎండల తీవ్రత కారణంగా బావుల్లో నీరు ఇంకిపోయిందని, ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కమిషనర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో వార్డు ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి తోట యాకయ్య, సభ్యులు తుప్పతూరి వెంకన్న, బండారి వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యగారిపల్లిలో సూరమ్మ మృతి

## సంతాపం తెలిపిన 5వ వార్డు సభ్యులు దేశ్‌ముఖ్




**కురవి / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కొండ సూరమ్మ స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా 5వ వార్డు సభ్యులు దేశ్‌ముఖ్ ఆమె మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సూరమ్మ అమ్మమ్మతో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని, ప్రతి సారి కలిసినప్పుడు "మనవడా" అని ఆప్యాయంగా పిలిచేదని ఆయన గుర్తుచేసుకున్నారు. అలాగే "నాకు పెన్షన్ నువ్వే పెట్టించాలి" అంటూ ప్రేమగా చెప్పేదని తెలిపారు. ఆమె మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. కొండ సూరమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని దేశ్‌ముఖ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షాగాని రవి, జిన్నె నరేందర్, దూదిమెట్ల కార్తీక్, బొల్లు వేణు, పొన్నెబోయిన రాకేష్, కందుల శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక

RNI NO:TGTEL/26/A0383

WWW.JANAMVOICE.COM


# జర్నలిస్టుల సమస్యలపై జేఎస్ఎస్ రాజీలేని పోరాటం..!

**జేఎస్ఎస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఎల్. దేవేందర్ నాయక్. సిద్ధిపేట జిల్లా నూతన అధ్యక్షులుగా పి.వంశీకృష్ణ ప్రధాన కార్యదర్శిగా గుర్రపు శ్రీనివాస్ ఎన్నిక.**



**జనం వాయిస్, హుస్నాబాద్, మే 23:**

జర్నలిస్టుల సమస్యలపై జేఎస్ఎస్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని రాష్ట్ర జేఏఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు లావుడియా దేవేందర్ నాయక్ అన్నారు. శనివారం జేఎస్ఎస్ కార్యవర్గ సమావేశం హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమ సంఘం సిద్దిపేట అధ్యక్షుడిగా పరకాల వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుర్రపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఈసీ మెంబర్ ఎల్ దేవేందర్ నాయక్ సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షునిగా పరకాల వంశీ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుర్రపు శ్రీనివాస్ నియమితులయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా కొయ్యడ అనిల్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఎం. దామోదర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్త పూర్ణచందర్, కోశాధికారిగా కాపర్తి శ్రీకాంత్, మరియు జిల్లా కార్యవర్గ సభ్యులుగా గొర్ల విజయకుమార్, వికాస్ బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ జాతీయ అధ్యక్షులు మనసాని కృష్ణారెడ్డికి రాష్ట్ర అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాస్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఈసీ మెంబర్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, జాతీయ మరియు రాష్ట్ర నాయకత్వం అందించిన ఆదేశాల మేరకు ఈ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రోజు నుంచే ఈ కమిటీ జిల్లాలో అధికారికంగా తన విధులను ప్రారంభిస్తుందని ప్రకటించారు. జర్నలిస్టుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం జె.ఎస్.ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ద్వారా సాధించుకోవడంలో ఈ సంఘం ముందుంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే అక్రిడేషన్ కార్డులతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టు హక్కుల రక్షణ కోసం జె.ఎస్.ఎస్ ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తుందని ఆయన వివరించారు.

# ఓటర్ల మ్యాపింగ్‌లో మహబూబాబాద్ మొదటి స్థానం

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ / జనం వాయిస్:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా మ్యాపింగ్ లో రాష్ట్రంలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 92.24 శాతం మ్యాపింగ్ చేసి. రాష్ట్రంలోనే ముందు వరుసలో మహబూబాబాద్ జిల్లా ఉందని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002, 2025.. రెండు ఓటరు జాబితాల్లోనూ పేర్లు ఉంటే ఓటర్లు ఆధారాల కోసం ఎలాంటి ధ్రువపత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాపింగ్‌లో ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు, క్షేత్రస్థాయిలో బిఎల్వోలు, భారత్ ఎన్నికల చట్టం ప్రకారం ఓటర్ జాబితా తయారు చేయడం జరుగుతుందని, సవరణలకు పూర్తిగా అధికారం కలిగి ఉందని, ఓటర్ జాబితా యొక్క సమగ్రతను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు లేదా అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణలకు ఆదేశించడం జరుగుతుందని అన్నారు, ప్రస్తుతం ప్రజలు తరచుగా వలసలు వెళ్లడం వల్ల ఉన్న ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, తద్వారా ఓటరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు అయి ఉన్నారని, మరణించిన ఓటర్లు పేర్లు తొలగించడం, తదితర సమస్యలను ఉత్పన్నమయ్యాయి అని, అందువలన అర్హుడైన పౌరుడు కూడా ఓటరు జాబితా నుండి తప్పి పోకుండా అలాగే ఏ అనర్హుడు కూడా ఇందులో చేర్చబడుతుందని ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ను ప్రకటించింది అన్నారు, ఎస్ ఐ ఆర్ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు, ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్ నాయుడు, శ్యామ్ లోయ శర్మ, చక్రపాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపర్డెంట్ కిరణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

# సింగరేణి విద్యాసంస్థల ఉద్యోగాల భర్తీలో అక్రమాలు: పీడీఎస్‌యూ నిరసన

**అర్హత లేని వారికి, ఇంటర్వ్యూకు రాని వారికి పోస్టులా?.**

**జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీకాంత్ ఆగ్రహం.**

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి, మే 23:**

శ్రీరాంపూర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఇతర పోస్టుల భర్తీ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాతంత్ర విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విడుదల చేసిన ప్రకటన ప్రకారం అర్హతల ఆధారంగా నియామకాలు చేపట్టకుండా, నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని తీవ్రంగా ఆరోపించారు. ఈ నియామకాల్లో పారదర్శకత లోపించిందని, కనీసం ముఖాముఖి పరీక్షకు కూడా హాజరుకాని వ్యక్తులను, గతంలో అక్కడ పనిచేసిన వారనే సాకుతో మళ్లీ విధుల్లోకి తీసుకోవడం వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసేలా సాగిన ఈ విరుద్ధ నియామకాలపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.




# 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

**నిందితురాలి అరెస్ట్, జుడీషియల్ రిమాండ్‌కు తరలింపు.**

**వివరాలు వెల్లడించిన సిద్ధిపేట సీపీ రష్మీ పెరుమాళ్.**



**జనం వాయిస్. అక్కన్నపేట, మే23:**

అక్కన్నపేట మండలం లోని మంచినీళ్ళ బండ గ్రామంలో కలకలం రేపిన బోయిని రాజ్యలక్ష్మి ఏ రాజవ్వ హత్య ఉదంతం దొంగతనం కాదు, కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్న భార్యే చేసిన హత్యగా పోలీసులు తేల్చారు. నిందితురాలిని అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మంచినీళ్ళ బండ గ్రామానికి చెందిన బోయిని కనకయ్య (52) వ్యవసాయంతో పాటు హమాలీ పని చేస్తుంటాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య రాజ్యలక్ష్మి, చిన్న భార్య బోయిని రాధ. ముగ్గురూ కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ నెల 21-05-2026న కనకయ్య హమాలీ పని నిమిత్తం కట్కూర్ గ్రామానికి వెళ్ళాడు. రాత్రి సుమారు 09:00 గంటల సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి పెద్ద భార్య రాజ్యలక్ష్మిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచి, మెడలోని 3.5 తులాల బంగారు పుస్తెల త్రాడును ఎత్తుకెళ్ళినట్లు కనకయ్యకు సమాచారం అందింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కనకయ్య ఫిర్యాదు మేరకు అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

### తేలిన అసలు నిజం:

కేసు నమోదు చేసుకున్న అక్కన్నపేట పోలీసులు రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగినట్లుగా సృష్టించిన సీన్‌పై అనుమానం రావడంతో విచారించగా, అసలు నిజం బయటపడింది. కుటుంబ గొడవల నేపథ్యంలో కనక్కయ్య పెద్ద భార్య యొక్క పెంతనం ఎక్కువ అయి , ప్రతి దానికి చిన్న భార్య ను అనుమానం వ్యక్తం చేస్తూ తిడుతుండేది. 21/05/2026 రాత్రి ప్రాంతంలో పెద్ద భార్య చిన్న భార్యతో గొడవ పెట్టుకున్నది. రాజ్యలక్ష్మి నిద్రిస్తున్న సమయంలో , రాధతో ఊకె లొల్లిపెట్టుకుందని ఇంట్లో ఉన్న కర్రతో రాజ్యలక్ష్మి తలపైన ,చిన్న భార్య బోయిని రాధనే పెద్ద భార్య రాజ్యలక్ష్మిని తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లు తేలింది. తను చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి, జిల్లాలో దొంగలు పడుతున్నారనే విషయాన్ని ఆసరాగా తీసుకుని, తానే మెడలోని బంగారాన్ని తీసివేసి ఒక దగ్గర భద్ర పరిచి, కదలికలు లేకుండా పడి ఉన్న రాజ్యలక్ష్మి చూసి చనిపోయింది అనుకొని, ఇంటి ముందుకు వెళ్ళి పెద్ద పెద్దగా కేకలు వేస్తూ... గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసి హత్య చేసినట్లుగా తప్పుడు ప్రచారం సృష్టించింది. పోలీసులు నిందితురాలు బోయిని రాధను అరెస్ట్ చేసి, జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

**నకిలీ ఫిర్యాదులు ఇస్తే కఠిన చర్యలు: సీపీ రష్మీ పెరుమాళ్ హెచ్చరిక**

ఈ సందర్భంగా సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ మాట్లాడుతూ, కేవలం 24 గంటలో వ్యవధిలోనే ఈ కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి నిందితురాలిని పట్టుకున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసులన్నింటినీ పోలీసులు విజయవంతంగా ఛేదించారని పేర్కొన్నారు.

సమాజంలో నేరాలను అడ్డుకోవడానికి, సొంత రక్షణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఫేక్ (నకిలీ) కంప్లైంట్లు ఇస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు.

రష్మీ పెరుమాళ్ ఐపీఎస్, సీపీ, సిద్దిపేట.

ప్రజలకు పోలీస్ కమిషనర్ సూచనలు:

1. రాత్రి వేళల్లో ప్రజలు ఇళ్ళకు ఆరుబయట పడుకోవద్దనీ సూచించారు.
2. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళకు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
3. అన్ని గ్రామాల్లోనూ సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.
4. భద్రత కోసం సోలార్ లైట్లు వేయించుకోవాలని, ఇంటికి కాపలాగా కుక్కలను పెంచుకుంటే మంచిదని సూచించారు.

# పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ.

**నిందితుల అరెస్ట్.**

**మే 23 జనం వాయిస్, పాలకుర్తి:**

పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు ఇంటి చోరీ కేసు. ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి, వద్ద నుండి సుమారు 3 తులాల బంగారం, 70 తులాల వెండి వస్తువులు, ఒక కారు మరియు ఒక ఆటోను స్వాధీనం చేసుకోవడం జరిగింది. రికవరీ చేసిన బంగారం మరియు వెండి వస్తువుల విలువ సుమారు ₹6,25,000/- (ఆరు లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు) వరకు ఉంటుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు దాసరి మురళీకృష్ణ మరియు అతని సహచరులు నెల్లికుదురు మండలానికి చెందిన పాత నేరస్తులు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు నమోదై ఉండగా, పలుమార్లు జైలుకు వెళ్లివచ్చినట్లు విచారణలో తెలిసింది. నిందితులు పాలకుర్తి, కేశవపట్నం మరియు చొప్పదండి ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించినందుకు కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ మరియు వెస్ట్ జోన్ ఐజూ శ్రీ రాజమహేంద్ర నాయక్ పాలకుర్తి జ× శ్రీ జానకిరామ్ రెడ్డి , ా× డి. పవన్ కుమార్ , ×ఐ అసిస్ట్ అనలిస్ట్ సల్మాన్‌లను హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి , కానిస్టేబుళ్లు రమేష్, రాజ్‌కుమార్, యాకయ్య, ప్రశాంత్ రెడ్డి మరియు అభినందించారు. వేసవి కాలంలో ఇంటి చోరీలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండుటచేత ప్రజలు రాత్రి సమయంలో బయట నిద్రించే సందర్భాల్లో బంగారు ఆభరణాలు ధరించకుండా ఉండాలని, ఇంటికి తాళాలు వేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖ సూచించింది.

**నిందితుల వివరాలు**

A1) దాసరి మురళీకృష్ణ S/o నర్సయ్య,
వయస్సు: 30 సంవత్సరాలు,
కులం: ST-ఎరుకల,
వృత్తి: డ్రైవర్,
చిరునామా: మునిగెలవీడు గ్రామం, నెల్లికుదురు మండలం, మహబూబాబాద్ జిల్లా,

A2) దాసరి మురళి S/o ఉప్పలయ్య,
వయస్సు: 28 సంవత్సరాలు,
కులం: ST-ఎరుకల,
వృత్తి: వ్యవసాయం,
చిరునామా: మునిగెలవీడు గ్రామం, నెల్లికుదురు మండలం, మహబూబాబాద్ జిల్లా,
మరియు
3)CCL-1 ,4) CCL -2






# ధాన్యపు నిల్వల ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి, మే 23:**

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యపు రవాణా, నిల్వ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా, వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బెల్లంపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును సబ్ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ కృష్ణలతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముల్లో ధాన్యానికి సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసిన కలెక్టర్, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే లోడ్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

### మార్కెట్ గోదాముల్లో పక్కాగా ధాన్యం భద్రత ఏర్పాట్లు

గోదాములకు వచ్చే ధాన్యం లారీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, త్వరగా దిగుమతి (అన్‌లోడింగ్) చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మిల్లులు, గోదాముల వద్ద రవాణా వాహనాలు నిలిచిపోకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని భద్రపరిచేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పంటల మార్పిడి సాగుతో రైతుకు లాభం కార్యక్రమం.

**ముఖ్య అతిధులుగా ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి.**

**మరిపెడ మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి.**

**మరిపెడ(మే 23) జనం వాయిస్:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం శనివారం రోజు పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు లాభాదాయకం రైతులు పంట వ్యర్థలను దహనం చేసి భూమి సారాన్ని దెబ్బ తీయకండి. నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడంతోనే రైతులకు వ్యవసాయం లాబా సాటిగా మారుతుందని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని అంబెడ్కర్ కమ్యూనిటి హాల్ లో జరిగిన రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతు రైతులందరూ ఒకే పంట నిరంతరం సాగు చేయడం వలన భూసారం తగ్గిపోవడం,పంటకు డిమాండ్ తగ్గి రైతులకు నష్టాలు రావడం జరుగుతుందని కాబట్టి ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వలన భూమి తమ సహజ గుణాన్ని కోల్పోయి రైత్వంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూసార పరీక్షలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలనీ కోరారు. కెవికే మల్యాల శాస్త్రవేత్తలు ప్రశాంత్,సుహాసినిలు రైతులకు సాగులో మెలకువలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీర సింగ్ అరవింద్ రైతులు పాల్గొన్నారు.



# పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

**జనం వాయిస్. అక్కన్నపేట్. మే23:**

రామవరం ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులను వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది.. రైతులు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని ఖవశీ శ్రీలత సూచించారు. జనుము, జీలుగా, పచ్చ పెసలు వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి పుష్ప దశలోనే నేలలో కలపడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థం మరియు నత్రజని శాతం పెరుగుతాయని, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో భూమి సారం మెరుగుపడి, నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం పెరుగుతుంది. అలాగే రసాయన ఎరువుల అవసరం కొంతవరకు తగ్గి, పంట దిగుబడి మెరుగుపడుతుంది , పచ్చిరొట్ట ఎరువులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రైతులందరూ సబ్సిడీ పై వచ్చిన పచ్చిరొట్ట ఎరువులను సద్వినిగోగం చేసుకోవాలని సూచించారు. రైతులు వర్షాకాలం ప్రారంభానికి ముందు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను తీసుకొని సరైన సమయంలో సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, సర్పంచ్ బొమ్మ శ్రీశైలం గారు,ఉప సర్పంచ్ కనుకయ్య గారు,రైతులు గౌస్,హాజి, రమేష్, శ్రీనాథ్, ఆగ్రోస్ ప్రతినిధి శ్రీనివాస్ గారు తదితరులు పాల్గొన్నారు.



# మేడేపల్లి దశరథ్ కు కార్యకర్తల సంక్షేమ నిధి అందజేయాలి






**గార్ల /జనం వాయిస్ :**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటి వరకు పార్టీలోనే కొనసాగుతూ ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న సీనియర్ నాయకుడు మేడేపల్లి దశరథ్ కు తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమ నిధి అందజేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. నందమూరి తారక రామారావు మీద ఉన్న అభిమానంతో పార్టీ ఆవిర్భవించినప్పుడు ఎడ్ల బండి మీద ఎన్ టి ఆర్ ఫోటో పెట్టి బ్యాండ్ మేళాలతో పూరవీధులలో డాన్సులు చేస్తూ తన సొంత ఖర్చులతో ఊరేగింపులు నిర్వహించేవారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలకు తోడు ఆర్థికపరమైన ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న మేడేపల్లి దశరథ్ ను పార్టీ పరంగా సంక్షేమ నిధితో పాటు పార్టీ అధినాయకత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహబూబాబాద్ జిల్లాలో కాపర్ వైర్ దొంగతనాల ముఠా అరెస్ట్

... 11 కేసులు ఛేదించిన సీసీఎస్ కురవి పోలీసులు.
... రూ.1.15 లక్షల విలువైన 115 కిలోల కాపర్ వైర్ స్వాధీనం.
... డీఎస్పీ ఎన్. తిరుపతి రావు, మహబూబాబాద్ రూరల్ సిఐ ఎన్. అంజలి.




**కురవి / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లాలో కాపర్ వైర్ దొంగతనాల ముఠా అరెస్ట్ చేసి రూ. 1.15 లక్షల విలువైన 115 కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎన్. తిరుపతి రావు, మహబూబాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ ఎన్. అంజలి చెప్పారు. శనివారం కురవి ఎస్సై బి. సతీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.., జిల్లాలో వరుసగా నమోదవుతున్న కాపర్ వైర్ దొంగతనం కేసులపై జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కురవి, మరిపెడ, తొర్రూర్, నర్సింహులపేట, నెల్లికుదురు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కాపర్ వైర్ దొంగతనం కేసులను సీసీఎస్ పోలీసులు, కురవి ఎస్సై సతీష్, పోలీసు సిబ్బంది సంయుక్తంగా ఛేదించారు. మొత్తం 11 కేసులను డిటెక్ట్ చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దొంగిలించిన కాపర్ వైర్‌ను మహబూబాబాద్‌లో అమ్ముకునేందుకు తీసుకెళ్తుండగా కురవి మండలం నేరడ క్రాస్ రోడ్డు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 115 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. 1,15,000గా అంచనా వేశారు. అరెస్ట్ అయిన నిందితులు ఖమ్మం జిల్లా నాయుడుపేట ప్రాంతానికి చెందిన జల్లి ఇసాక్ (27), ఇట్టా అశోక్ (34), జల్లి అశోక్ (37), జల్లి ఇశ్రాయేల్ (22), అలాగే మహబూబాబాద్ జిల్లా పత్తిపాకకు చెందిన జల్లి భద్రి (23)గా పోలీసులు తెలిపారు. జిల్లాలో వరుసగా నమోదవుతున్న కాపర్ వైర్ దొంగతనం కేసులపై జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. డీఎస్పీ ఎన్. తిరుపతి రావు, మహబూబాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ ఎన్. అంజలి పర్యవేక్షణలో పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితులను గుర్తించి పట్టుకున్నట్లు వెల్లడించారు. పోలీసుల విచారణలో నిందితులు పలు కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను మహబూబాబాద్ కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ రాగి దొంగతనాలను కురవి ఎస్సై సతీష్, సెకండ్ ఎస్సై జయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ హతిరామ్ నేతృత్వంలోని ఎస్ఐ - ప్రవీణ్ కుమార్, హెచ్‌సి- కోల శ్రీనివాస రావు, హెచ్‌సి- హనీఫ్, పిసి- బాలు, పిసి- నరేష్ బృందం గుర్తించింది. త్వరితగతిన కేసులను ఛేదించిన సీసీఎస్, కురవి పోలీస్ సిబ్బందిని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

## పోగుల శ్రీనివాస్ స్థూపావిష్కరణకు సన్నాహాలు



**కురవి / జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామంలో ఈ నెల 25న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సేవలందించిన పోగుల శ్రీనివాస్ స్థూపావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ గ్రామ కార్యదర్శి బస్వ కొమరయ్య తెలిపారు. విద్యార్థి దశ నుంచే సిపిఐలో చురుకుగా పనిచేసిన పోగుల శ్రీనివాస్ మూడు దశాబ్దాల పాటు పార్టీకి సేవలందించారని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందిన ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థూపావిష్కరణను సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి నిర్వహించనుండగా, పతాకావిష్కరణను జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి చేపట్టనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బస్వ కొమరయ్య కోరారు.

# అధికారుల నిర్లక్ష్యం, కమీషన్ల దందా..?

... అప్పుల ఊబిలో సర్పంచులు!.
... కురవి, సీరోలు మండలాల్లో పీఆర్ ఏఈ తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం.

**కురవి / జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా కురవి, సీరోలు మండలాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, ఇతర అత్యవసర పనులను గ్రామ పంచాయతీ పాలకమండలి తీర్మానాల మేరకు సర్పంచులు పూర్తి చేశారు. అయితే, ఈ పనులకు సంబంధించిన నిధులను డ్రా చేసేందుకు పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ (గ్రా=ూజు) చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అసిస్టెంట్ పేరిట మధ్యవర్తి అవినీతి
నిధుల విడుదలకు కీలకమైన ఎంబీ రికార్డుల నమోదు (వీముంబతీవఏవత్ దీశీశీని) కోసం సర్పంచులు చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాల్సిన ఏఈ, అందుకు భిన్నంగా ఒక ప్రైవేట్ వ్యక్తిని తన వ్యక్తిగత అసిస్టెంట్‌గా నియమించుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సదరు మధ్యవర్తి చెప్పిందే ఫైనల్ నిర్ణయంగా మారుతోందని, ఏ విషయం మాట్లాడాలన్నా అతనితోనే బేరసారాలు సాగించాల్సి వస్తోందని సర్పంచులు బహిరంగంగానే చర్చిస్తున్నారు.

### పది శాతం ఇస్తేనే ఎంబీ రికార్డులు
సదరు మధ్యవర్తికి 10 శాతం కమీషన్ ఇస్తే వెంటనే ఎంబీ రికార్డులు సిద్ధం చేస్తున్నారని, ఒకవేళ లంచం ఇవ్వకపోతే చేసిన పనుల్లో లోపాలు ఉన్నాయంటూ వంకలు పెడుతున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇస్తే నిబంధనలకు విరుద్ధంగా మెజర్మెంట్స్ పెంచి రాస్తున్నారని, ఇవ్వని పక్షంలో తక్కువగా రికార్డు చేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

### సామాజిక వర్గాల వారీగా వివక్ష
ఈ అవినీతి దందాతో పాటు కురవి, సీరోలు మండలాల అధికారుల తీరులో సామాజిక వివక్ష కూడా స్పష్టంగా కనిపిస్తోందని సర్పంచులు ఆరోపిస్తున్నారు. తమకు నచ్చిన సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల పనులకు ఒకలా, ఇతరుల పనులకు మరోలా నిబంధనలు వర్తింపజేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు మండల సర్పంచుల ఫోరం అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటున్నారు.



### పెరుగుతున్న వడ్డీల భారం
గ్రామాల్లో పనులు ఆగిపోకూడదనే ఉద్దేశంతో సర్పంచులు బయట మార్కెట్‌లో అధిక వడ్డీలకు లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. ఏఈ నెలల తరబడి జాప్యం చేయడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి సర్పంచులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కురవి, సీరోలు మండలాల్లో జరుగుతున్న ఎంబీ రికార్డుల దందాపై విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేస్తున్నారు.

# కాంపల్లి ప్రధాన రహదారిపై అక్రమ కంకర, ఇసుక రాశులు

... డ్రైనేజీ పూడ్చివేతతో గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు.
... అధికారులు స్పందించాలని గ్రామస్తుల డిమాండ్.

**కురవి / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం కాంపల్లి గ్రామం నుండి సిరోల్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై అక్రమంగా కంకర, ఇసుక రాశులు వేయడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంపల్లి వైన్ షాపు ఎదురుగా రోడ్డుపై భారీగా కంకర, ఇసుక పోసి, సైడ్ డ్రైనేజీ కాలువను పూర్తిగా పూడ్చివేసిన ఘటన స్థానికంగా ఆందోళనకు దారితీసింది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం ఎలాంటి అనుమతులు లేకుండానే రహదారి పక్కన నిర్మాణ సామగ్రిని నిల్వ ఉంచడంతో పాటు డ్రైనేజీ ప్రవాహాన్ని అడ్డుకునే విధంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. దీంతో కాలువలో నీరు వెళ్లకుండా నిలిచిపోతుండటంతో పాటు రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అదే ప్రాంతంలో వైన్ షాపుకు వచ్చే వాహనాలు ఒకవైపు నిలుస్తుండగా, మరోవైపు కంకర, ఇసుక కుప్పలు ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా ఇది కాంపల్లి నుండి సీరోలు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి ఇరు ప్రక్కల ఉన్న డ్రైనేజీ కాలువల కొలతలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామపంచాయతీ నుండి గృహనిర్మాణానికి ఎలాంటి అనుమతి లేదని కూడా వారు ఆరోపించారు. ఇప్పటికే గ్రామ సెక్రటరీ, ఎంపీవో, డీపీవో అధికారులకు ఫోటో ఆధారాలతో వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే జిల్లా స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేసిన సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి..

**ఎండ తీవ్రతలో కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన..**

**జనం వాయిస్. చిగురు మామిడి:**
చిగురుమామిడి:ఎండ తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు లంబాడిపల్లె గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి తన సొంత ఖర్చులతో దాదాపు 100 మంది కూలీలకు మజ్జిగ,ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం అందజేశారు.మజ్జిగ ప్యాకెట్ల పంపిణీతోపాటు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,కూలీల ఆరోగ్యం కోసం తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సంపత్ రెడ్డి పిలుపునిచ్చారు.ఉదయాన్నే 6గంటలకే పనులకు వెళ్లి,ఎండ తీవ్రత పెరిగే మధ్యాహ్నం 10లేదా 11గంటల లోపు పనులను ముగించుకోవాలని,పనిచేసే ప్రదేశాల్లో చల్లటి మంచినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. త్రాగడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ నీటిశాతం తగ్గడాన్ని నివారిస్తాయన్నారు.పని ప్రదేశాల్లో చెట్ల కింద లేదా ప్రత్యేకంగా టెంట్లు వేసి విశ్రాంతి తీసుకునేందుకు నీడను ఏర్పాటు చేయాలని,మధ్యాహ్నం వేళల్లో ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు రాకుండా ఇంట్లోనే ఉండటం మంచిదని కూలీలకు వివరించారు.ఉపాధి కూలీలు ఎండ దెబ్బ బారిన పడకుండా ఈ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు సర్పంచ్ సంపత్ రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్క ఓదెలు యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మావతి, వార్డు సభ్యులు మంద లక్ష్మణ్, రెడ్డి సంఘం నాయకులు పింగిలి సంపత్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బందారిపల్లి రాజు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



## వ్యాయామానికి సమయం కేటాయించాలి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి, మే 23:**
మంచిర్యాల:ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని వ్యాయామం, యోగాకు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18 నుండి 23 వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా, అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలో శారీరక శ్రమ, ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు




# దేవరుప్పుల పీఎస్‌లో ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ

**సిబ్బంది అప్రమత్తం, రికార్డుల నిర్వహణపై ఆరా.**

**మే 23, జనం వాయిస్, పాలకుర్తి:**
దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఐపీఎస్ అధికారిణి మనీషా నెహ్రా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు హఠాత్తుగా వచ్చిన అధికారిణిని చూసి సిబ్బంది అప్రమత్తమయ్యారు.తనిఖీల్లో భాగంగా కిట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి సిబ్బంది సంసిద్ధతను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, క్రైమ్ పెట్రోలింగ్ వాహనాలు, కేసు ప్రాపర్టీ రూమ్, కోర్టు డ్యూటీ రికార్డులు, స్టేషన్ వర్క్‌స్టేషన్, జనరల్ డైరీ, క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఎస్‌హెచ్‌ఓతో పాటు సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్, పెండింగ్ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. "పోలీస్ స్టేషన్ అంటే ప్రజలకు భరోసా. విధుల్లో క్రమశిక్షణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ బాధితుల పట్ల సత్వర స్పందన ఉండాలి" అని సిబ్బందిని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.ఈ తనిఖీలో దేవరుప్పుల ఎస్‌హెచ్‌ఓతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# పాము కాటుకు మహిళా మృతి

## మద్దెల పల్లవి కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ముస్మి గ్రామపంచాయతీ పరిధిలోని కర్ణగండి గ్రామానికి చెందిన ఆదివాసి నిరుపేద మహిళ మద్దెల పల్లవి (భర్త సారయ్య) జీవనోపాధి కోసం తునీకాకు సేకరణ పనులకు అడవికి వెళ్లిన సమయంలో విషసర్పం కాటుకు గురై మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. పాము కాటుకు గురైన పల్లవిని వెంటనే మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. శనివారం కర్ణగండిలోని వారి స్వగృహానికి చేరుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, తెలంగాణ రాష్ట్ర కేబినెట్ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య మాట్లాడుతూ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మద్దెల పల్లవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎదుల్లపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, గ్రామ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



RNI NO:TGTEL/26/A0383
దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM


## మహేశ్వరం ఎమ్మెల్యే శంకుస్థాపనలకే

# పరిమితమా

**మహేశ్వరం, మే 23, (జనం వాయిస్):**
మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపనలకే పరిమితమా అని హర్షగూడ బిజెపి నాయకులు రవి నాయక్ అన్నారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో సబితా ఇంద్రారెడ్డి మంఖల్ నుండి హర్షగూడ వరకు బీటి రోడ్డు కోసం శంకుస్థాపన చేయడం జరిగింది. శంకుస్థాపన చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు రోడ్డు పనులు ప్రారంభం కాలేదని రోడ్డు పూర్తిగా గుంతలు గుంతలుగా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని రాత్రి పూట గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్న కనీసం పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జోక్యం చేసుకొని హర్షగూడ బీటీ రోడ్డు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా బాధ్యత తీసుకొని వెంటనే బీటీ రోడ్డు పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని రవి నాయక్ కోరారు. లేనిపక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రవి నాయక్ హెచ్చరించారు. గత మూడు సంవత్సరాలుగా స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారు రోడ్ ఎప్పుడు పడుతుందా అని కానీ చూచిచూచి ప్రజలకే ఆశ నిరాశ అయిందని అనే బిటి రోడ్డు మాత్రం కావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోనైనా గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని రవి నాయక్ కోరారు.

**మంఖల్ నుండి హర్షగూడ బీటీ రోడ్డు కు మోక్షం ఎప్పుడో...?**
**శంకుస్థాపన చేసి 3 సంవత్సరాలు అవుతున్న మొదలుకాని బీటీ రోడ్డు పనులు.**
**ప్రమాదానికి నిలయంగా హర్షగూడ రోడ్డు.**
**హర్షగూడ బీటీ రోడ్డు పనులు వెంటనే మొదలుపెట్టాలి.**
**హర్షగూడ బిజెపి నాయకులు రవి నాయక్.**







## అనుమానాస్పద స్థితిలో

# యువకుడి మృతి

**తలకు బలమైన గాయాలు!.**
**గుడిపేట గ్రామంలో విషాదం.**
**దర్యాప్తు చేస్తున్న పోలీసులు.**

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి, మే 23:**
హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిపేట గ్రామానికి చెందిన సాయిని కుమార్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. తలకు బలమైన గాయాలై, తీవ్ర రక్తస్రావమైన స్థితిలో శవమై కనిపించిన కుమార్ మృతికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు జరుపుతున్నట్లు హాజీపూర్ ఎస్సై కిరణ్ తెలిపారు.



## మండే ఎండలకు పశువులు,

# పక్షులు విలవిల!.

**- ప్రాణాలు వదులుతున్న పశువులు, రామచిలుకలు.**

**జనం వాయిస్, మే 23:**
తెలంగాణ రాష్ట్రంలో గత రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడం తో ప్రజలు ఉక్కిరి, బిక్కిరి, అవుతున్నారు భానుడి భగభగలకు కొన్ని ప్రాంతాలలో వడదెబ్బలు తగిలి జనాలు మరణిస్తున్నా రు.కేవలం మనుషులే కాకుండా పశువులు, పక్షులు కూడా ఎండ తీవ్రతకు ప్రాణాలు కోల్పోవడం కలచి వేస్తుంది,శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ లో మండే ఎండలకు ఓ రైతుకు సంబంధిం చిన ఎద్దు మరణించింది. అలాగే కరీంనగర్ జిల్లా హుజరాబాద్ మండలం పరిధిలోని బోర్నపల్లి శివారులో శుక్రవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతను తట్టుకోలేక రామచిలుకలు రోడ్డుపైనే సొమ్మసిల్లి పడిపోయి ప్రాణాలు కోల్పోతున్నాయి.



# భానుడి భగభగలు,ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

**ననావత్ భూపాల్ నాయక్ సూచనలు**

**మరిపెడ(మే 23)జనం వాయిస్:**
తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో,ప్రజల భద్రత కోసం గిరిజన నాయకుడు నేనావత్ భూపాల్ నాయక్ ముందుకు వచ్చి కీలక సూచనలు చేశారు.భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.ఉత్తర, తూర్పు జిల్లాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఇది మామూలు ఎండ కాదు,ప్రాణాల మీదికి వచ్చే ప్రమాదం.అందుకే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**భూపాల్ నాయక్ ప్రజలకు ఇచ్చిన ముఖ్య సూచనలు:**

1.మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు బయటకు రావద్దు ఇదే సమయంలో ఎండ తీవ్రంగా ఉంటుంది.తప్పనిసరి పనుంటే తలకు గుడ్డ,గొడుగు,నీళ్ల బాటిల్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
2.తరచుగా నీరు తాగండి దాహం వేయకపోయినా ప్రతి అరగంటకు ఒక గ్లాసు నీళు ్ల తాగే అలవాటు చేసుకోండి.మజ్జిగ,కొబ్బరి నీళు ్ల,నిమ్మరసం ఎక్కువగా తీసుకోండి.
3.తేలికపాటి దుస్తులు ధరించండి పత్తి బట్టలు, లేత రంగుల దుస్తులు శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
4.పిల్లలు,వృద్ధులు,రైతులపై ప్రత్యేక శ్రద్ధ వీరు త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతారు.వారిని ఎండలో ఎక్కువ సేపు ఉంచొద్దు.
5.సన్‌స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించండి.



6.తలనొప్పి,వాంతులు,మైకం,అధిక జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు.

ప్రజల ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు.ప్రభుత్వం తాగునీటి కేంద్రాలు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నా,మనం కూడా మన వంతు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఒకరినొకరు చూసుకుంటూ ఈ ఎండాకాలాన్ని సురక్షితంగా దాటాలి అని భూపాల్ నాయక్ పిలుపునిచ్చారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో రెండు రోజులు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉండటంతో,ప్రజలు తగిన జాగ్రత్తలు సూచనలు పాటించాలని ఆయన కోరారు.

## దుఃఖాన్ని దిగమింగుకొని

# సేవా కార్యక్రమాలు.

- **రామిళ్ల దంపతుల సేవాభావం అభినందనీయం.**
- **కుమారుడి వర్ధంతి సందర్బంగా అమ్మ పరివార్ లో ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదానం.**

**జనం వాయిస్, గోదావరిఖని, మే 23:**
కరోనా కారణంగా వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కుమారులను కోల్పోయిన గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన రామిళ్ల రామలింగంమంగళ దంపతులు గత ఐదు సంవత్సరాలుగా వారి జ్ఞాపకార్థం సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం తమ కుమారుడు రామిళ్ల శైలేంద్రకుమార్ ఐదవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఫైవ్ ఇంక్లైన్ ఏరియాలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదానం చేసారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తీవ్ర విషాదాన్ని తట్టుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్న రామిళ్ల దంపతుల సేవాభావం అభినందనీయమన్నారు. సమాజంలోని దాతలు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని నిరాశ్రయులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిల్ల కుటుంబ సభ్యులు శైలజ, వైష్ణవి, వణుష్ణ, రాజేంద్రకుమార్, జ్యోతి, విశ్వజిత్, నిత్యసాయి, మహేంద్ర కుమార్, సుప్రియ, కృతిక్, రవీంద్రకుమార్, గురుపాదం, మిత్రులు మేజిక్ రాజా, మేజిక్ హరి, చంద్రపాల్, ఆశ్రమ నిర్వాహకులు నాగరాజు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.




# పెద్దపల్లిలో ఉద్యోగ సాధన మేళా విజయవంతం

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన.
- ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత.
- ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహణ.
- యువత భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా చర్యలు.



**జనం వాయిస్, పెద్దపల్లి, మే 23:**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "ఉద్యోగ సాధన మేళా" శనివారం విజయవంతంగా ముగిసింది. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతి, యువకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టాస్క్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో అనేక ఉపాధి అవకాశాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగ సాధన మేళాలో వివిధ రంగాలకు చెందిన సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. అర్హతలు, ప్రతిభ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ స్వయంగా నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఉద్యోగాలు పొందిన యువత ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక మెమెంటోలు అందజేసి కలెక్టర్ అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎ.సురేష్, జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి ఎం.రాజశేఖర్, జీఎం డీఐసీ కీర్తికాంత్, టాస్క్ అధికారులు, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరిని కలెక్టర్ అభినందించారు.






# సహజంగా గులాబీ రంగు పెదాలు.

- ఇంటి చిట్కాలతో అందం మీ సొంతం.
- పెదాల రంగు మారడానికి కారణాలేమిటి?.
- సహజ చిట్కాలతో పెదాల సంరక్షణ.
- నీళ్లు, ఆహారం కూడా ముఖ్యమే.



**జనం వాయిస్, డెస్క్, మే 23:**
చాలామంది సహజంగా గులాబీ రంగులో ఉండే మృదువైన పెదాలను కోరుకుంటుంటారు. అయితే ఎండ, ధూమపానం, నీళ్లు తక్కువగా తాగడం, నాణ్యతలేని లిప్ ఉత్పత్తులు వాడడం వంటి కారణాలతో పెదాలు నల్లబడటం లేదా పొడిబారడం జరుగుతోంది. దీంతో పెదాల సంరక్షణపై యువత ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. పెదాల రంగు మారడానికి ప్రధాన కారణాల్లో శరీరంలో నీటి లోపం కూడా ఒకటి. ఎక్కువగా టీ, కాఫీ తీసుకోవడం, పెదాలను తరచూ నాలుకతో తడపడం వల్ల కూడా పెదాలు పొడిబారే అవకాశం ఉంటుంది. రాత్రిళ్లు మేకప్ తొలగించకుండా పడుకోవడం వల్ల పెదాల సహజ కాంతి తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. సహజంగా పెదాలు మృదువుగా కనిపించాలంటే ఇంటి చిట్కాలు ఉపయోగపడవచ్చని పలువురు సూచిస్తున్నారు. తేనెలో కొద్దిగా చక్కెర కలిపి మెల్లగా రుద్దితే మృతకణాలు తొలగే అవకాశం ఉంటుంది. బీట్‌రూట్ రసం కొద్దిగా రాసుకుంటే సహజ రంగు మెరుగుపడవచ్చని చెబుతున్నారు. అలాగే నిద్రకు ముందు నెయ్యి లేదా కొబ్బరి నూనె రాసుకుంటే పెదాలు పొడిబారకుండా ఉండవచ్చు. రోజుకు తగినంత నీళ్లు తాగడం పెదాల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. పండ్లు, ఆకుకూరలు, విటమిన్‌లతో కూడిన ఆహారం తీసుకుంటే శరీరానికి తేమ అందుతుంది. దీంతో పెదాలు కూడా ఆరోగ్యంగా కనిపించే అవకాశం ఉంటుంది. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు మంచి నాణ్యత గల లిప్ బామ్ ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పెదాల సంరక్షణలో సహజ పద్ధతులు కొంతమేర ఉపయోగపడవచ్చేమో కానీ తీవ్రమైన అలర్జీలు లేదా చర్మ సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



# నిమ్మకాయతో మోకాళ్ల నొప్పులకు ఉపశమనం.





- - ఇంటి చిట్కాలపై పెరుగుతున్న ఆసక్తి.
- - సహజ చిట్కాలవైపు ప్రజల దృష్టి.
- - నిమ్మకాయ వినియోగంపై చర్చ.
- - వ్యాయామం కూడా తప్పనిసరి.

**జనం వాయిస్, డెస్క్, మే 23:**
మోకాళ్ల నొప్పులు ప్రస్తుతం అన్ని వయసుల వారిలో కనిపిస్తున్నాయి. ఎక్కువసేపు కూర్చోవడం, వ్యాయామం లేకపోవడం, బరువు పెరగడం వంటి కారణాలతో చాలామంది కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మందులతో పాటు సహజ పద్ధతులపై కూడా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అలాంటి ఇంటి చిట్కాల్లో నిమ్మకాయ వినియోగం గురించి ఇప్పుడు ఎక్కువగా చర్చ జరుగుతోంది. నిమ్మకాయలో ఉండే విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి కొంత ఉపశమనం ఇవ్వవచ్చని పలువురు చెబుతున్నారు. కొంతమంది నిమ్మకాయను మధ్యలో కోసి మోకాళ్లపై మెల్లగా రుద్దుతున్నారు. మరికొందరు గోరువెచ్చని నువ్వుల నూనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి మోకాళ్లకు మర్దన చేస్తున్నారు. ఇంకొందరు నిమ్మ తొక్కలను గుడ్డలో కట్టి కొద్దిసేపు మోకాళ్లపై ఉంచుతున్నారు. ఉదయం గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరానికి తేమ అందుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు నియంత్రణలో ఉండటానికి కూడా ఇది సహాయపడవచ్చని పేర్కొంటున్నారు. బరువు తగ్గితే మోకాళ్లపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. అయితే నిమ్మకాయ ఒక్కటే మోకాళ్ల నొప్పిని పూర్తిగా తగ్గించే ఔషధం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. చర్మం సున్నితంగా ఉండేవారు నిమ్మరసం నేరుగా రాస్తే మంట లేదా దురద రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ముందుగా కొద్దిగా పరీక్షించి ఉపయోగించడం మంచిదని సూచిస్తున్నారు. మోకాళ్లలో తీవ్రమైన నొప్పి, వాపు, నడవలేని పరిస్థితి ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. మోకాళ్ల ఆరోగ్యానికి సరైన ఆహారం, తేలికపాటి వ్యాయామం, నడక చాలా అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ కొంతసేపు నడవడం, కాళ్లకు సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల కీళ్ల బలం మెరుగుపడుతుందని చెబుతున్నారు. సహజ చిట్కాలు కొంత ఉపశమనం ఇవ్వొచ్చేమో కానీ శాశ్వత పరిష్కారం కోసం సరైన వైద్య సలహా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# గుడ్డు పెంకులతో ఫేస్‌ప్యాక్?.. సహజ అందం కోసం కొత్త ప్రయత్నాలు

- గుడ్డు పెంకుల వినియోగంపై పెరుగుతున్న ఆసక్తి.
- ఫేస్‌ప్యాక్‌గా ఎలా ఉపయోగిస్తున్నారు?.
- జాగ్రత్తలు తప్పనిసరి.





**జనం వాయిస్, డెస్క్, మే 23:**
ఇంటి చిట్కాలతో చర్మ సంరక్షణ చేసుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సహజ పదార్థాలతో ఫేస్‌ప్యాక్‌లు తయారు చేసుకునే వారు ఇప్పుడు గుడ్డు పెంకులను కూడా ఉపయోగిస్తున్నారు. గుడ్డు పెంకుల్లో కాల్షియం వంటి ఖనిజాలు ఉండటంతో చర్మానికి ఉపయోగపడవచ్చని పలువురు చెబుతున్నారు. గుడ్డు పెంకులను ముందుగా శుభ్రంగా కడిగి పూర్తిగా ఎండబెడుతున్నారు. తర్వాత వాటిని మెత్తగా పొడిలా చేసుకుని తేనె, పెరుగు లేదా గులాబీ నీటితో కలిపి ఫేస్‌ప్యాక్‌గా ఉపయోగిస్తున్నారు. కొంతసేపు ముఖంపై ఉంచి తర్వాత చల్లని నీటితో కడుగుతున్నారు. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా అనిపించవచ్చని చెబుతున్నారు. కొంతమంది గుడ్డు పెంకు పొడి మృతకణాలను తొలగించడంలో సహాయపడవచ్చని అంటున్నారు. దీంతో చర్మం తాజాగా కనిపించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే దీనిపై పూర్తి స్థాయి వైద్య ఆధారాలు పరిమితంగానే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. గుడ్డు పెంకులను ఉపయోగించే ముందు పరిశుభ్రత చాలా ముఖ్యం. సరిగా శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే చర్మం సున్నితంగా ఉండేవారు ముందుగా చేతిపై కొద్దిగా పరీక్షించి మాత్రమే ఉపయోగించడం మంచిదని సూచిస్తున్నారు. అలర్జీలు, మొటిమలు లేదా ఇతర చర్మ సమస్యలు ఉన్నవారు ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా చర్మ వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. సహజ పద్ధతులు కొంతమేర ఉపయోగపడవచ్చేమో కానీ ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా ఫలితాలు రావని స్పష్టం చేస్తున్నారు.

దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# ప్రెగాబాలిన్‌పై కేంద్రం కఠిన ఆంక్షలు

నరాల సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పుల చికిత్సలో విస్తృతంగా ఉపయోగించే ప్రెగాబాలిన్ మందుపై కేంద్ర ఆరోగ్య శాఖ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ మందును కొందరు దుర్వినియోగం చేస్తున్నారనే ఆందోళనల నేపథ్యంలో ప్రెగాబాలిన్‌ను కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ హెచ్–1 జాబితాలో చేర్చింది. ఈ నిర్ణయం ప్రకారం ఇకపై ప్రెగాబాలిన్ మందును కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా వైద్యుల చిట్టీ అవసరం ఉంటుంది. ఫార్మసీలు ఆ ప్రిస్క్రిప్షన్ ప్రతిని తమ వద్ద భద్రపరచడంతో పాటు, మందు వినియోగదారుల వివరాలను కనీసం మూడు సంవత్సరాల పాటు నమోదు చేసి ఉంచాలని కేంద్రం తన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ప్రెగాబాలిన్ ట్యాబ్లెట్ల వినియోగంపై పలు రాష్ట్రాలు ఇటీవల ఆందోళనలు వ్యక్తం చేశాయి. ముఖ్యంగా యువత ఈ మందును మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు వచ్చిన నివేదికలు కేంద్రాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో అమ్మకాలపై కఠిన నియంత్రణలు అవసరమని ఆరోగ్య శాఖ భావించింది. ప్రభుత్వం ప్రకారం ఈ నిర్ణయం వల్ల మందు సరైన రీతిలో వినియోగించబడటంతో పాటు అక్రమ అమ్మకాలు, దుర్వినియోగాన్ని నియంత్రించవచ్చని భావిస్తున్నారు. డ్రగ్ దుర్వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను నివారించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రెగాబాలిన్ మందును ప్రధానంగా న్యూరోపథీ, ఫైబ్రోమయాల్జియా, దీర్ఘకాలిక నొప్పులు, నరాల సంబంధిత సమస్యల చికిత్సలో వైద్యులు సూచిస్తుంటారు. అయితే మార్కెట్లో ఈ మందుకు భారీ డిమాండ్ ఉండటంతో కొందరు దాన్ని తప్పుగా వినియోగిస్తున్నట్లు ఆరోగ్య శాఖ గుర్తించింది. దేశవ్యాప్తంగా అక్రమంగా ప్రెగాబాలిన్ విక్రయాలు జరుగుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో ఇకపై ఈ మందు ప్యాకెట్లపై 'షెడ్యూల్ హెచ్–1 హెచ్చరిక' తప్పనిసరిగా ముద్రించాలని తయారీ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం షెడ్యూల్ హెచ్‌లో ఉన్న ఈ మందును హెచ్–1 కేటగిరీకి మార్చడంతో నియంత్రణ మరింత కఠినమైంది. షెడ్యూల్ హెచ్–1 జాబితాలో సాధారణంగా బలమైన యాంటీబయాటిక్స్, క్షయవ్యాధి మందులు, అలవాటు పడే ప్రమాదం ఉన్న ఔషధాలు ఉంటాయి. 2022లో పశ్చిమ పంజాబ్ ప్రాంతంలో నిర్వహించిన అధ్యయనంలో యువతలో ప్రెగాబాలిన్ దుర్వినియోగం పెరుగుతున్నట్లు వెల్లడైన విషయం తెలిసిందే. దీంతో ఈ మందుపై కఠిన నిఘా అవసరమని నిపుణులు సూచించారు.







# ఇంధన ధరల మోత.. సామాన్యుడిపై మరో భారం

దేశవ్యాప్తంగా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి భారీ షాక్ ఇచ్చింది. ఇప్పటికే గత కొన్ని రోజుల వ్యవధిలోనే రెండుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన చమురు సంస్థలు.. తాజాగా మూడోసారి కూడా రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు అదనంగా పెరిగాయి. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. వరుస ధరల పెంపులతో సామాన్య ప్రజలపై మరింత ఆర్థిక భారం పడనుంది. గతంలో లీటరు పెట్రోల్‌పై మూడు రూపాయలు పెంచిన చమురు సంస్థలు.. ఆ తర్వాత మరో విడతలో 90 పైసలు పెంచాయి. ఇప్పుడు మూడోసారి కూడా ధరలు పెంచడంతో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలు గత నాలుగేళ్లుగా భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయని కేంద్రం పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా ఈ పెంపుకు ప్రధాన కారణాలుగా వెల్లడించింది. భారతదేశం తన అవసరాల్లో ఎక్కువ భాగం ముడిచమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుండటంతో అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం నేరుగా దేశీయ ధరలపై పడుతోంది. తాజా ధరల పెంపుతో కేవలం వాహనదారులకే కాకుండా సాధారణ ప్రజలందరికీ ప్రభావం పడనుంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగే అవకాశముంది. దీని ప్రభావం కూరగాయలు, పాలు, పప్పుధాన్యాలు, నిత్యావసర సరుకుల ధరలపై పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల మార్కెట్‌లో సరుకుల ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజా పెంపు తర్వాత హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.112.71కు చేరుకోగా, డీజిల్ ధర రూ.100.86గా నమోదైంది. విజయవాడలో పెట్రోల్ ధర రూ.113.95, డీజిల్ ధర రూ.101.11కు చేరుకుంది. ఢిల్లీలో పెట్రోల్ రూ.99.51, డీజిల్ రూ.92.49గా ఉంది. ముంబైలో పెట్రోల్ రూ.108.46, డీజిల్ రూ.94.99గా నమోదైంది. బెంగళూరులో పెట్రోల్ రూ.108.02, డీజిల్ రూ.95.95గా ఉండగా, కోల్‌కతాలో పెట్రోల్ రూ.110.57, డీజిల్ రూ.96.98కు చేరాయి. చెన్నైలో పెట్రోల్ రూ.105.38, డీజిల్ రూ.97.02గా కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ నగరాల్లో పెట్రోల్ ధరలు రూ.112 మార్కును దాటిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస ధరల పెంపుతో కుటుంబ బడ్జెట్ దెబ్బతింటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకంతో స్థిరమైన నెలవారీ ఆదాయం..

ఎలాంటి రిస్క్ లేకుండా ప్రతి నెలా స్థిరమైన ఆదాయం కావాలనుకునే పెట్టుబడిదారులకు పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకం (పిఓఎంఐఎస్) మంచి ఎంపికగా మారుతోంది. మార్కెట్‌లో వచ్చే హెచ్చుతగ్గుల ప్రభావం లేకుండా నమ్మకమైన రాబడి అందించే ఈ పథకం ముఖ్యంగా పదవీ విరమణ చేసినవారికి, సురక్షిత పెట్టుబడిని కోరుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకంలో వ్యక్తిగత ఖాతాదారుడు గరిష్ఠంగా రూ.9 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. అదే జాయింట్ ఖాతా అయితే రూ.15 లక్షల వరకు పెట్టుబడి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 7.4 శాతం వార్షిక వడ్డీని అందిస్తోంది. ఈ వడ్డీ ప్రతి నెలా ఖాతాదారుడి ఖాతాలో జమ అవుతుంది. వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంది. రూ.15 లక్షల జాయింట్ పెట్టుబడిపై నెలకు సుమారు రూ.9,249 వరకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. ఏడాదికి దాదాపు రూ.1,11,000 వరకు వడ్డీ పొందే అవకాశం ఉంటుంది. ఐదు సంవత్సరాల కాలపరిమితిలో మొత్తం సుమారు రూ.5,55,000 వరకు వడ్డీ ఆదాయం పొందవచ్చని అంచనా వేయబడుతోంది. ఈ పథకానికి ఐదు సంవత్సరాల మెచ్యూరిటీ కాలం ఉంటుంది. పెట్టుబడి చేసిన మొదటి సంవత్సరం పూర్తయ్యే వరకు డబ్బు ఉపసంహరించుకునే అవకాశం ఉండదు. మూడు సంవత్సరాల లోపు ఖాతా మూసివేస్తే రెండు శాతం కోత విధిస్తారు. మూడు సంవత్సరాల తర్వాత మూసివేస్తే ఒక శాతం కోత విధించే నిబంధన ఉంది. పన్ను విషయానికి వస్తే ఈ పథకంలో పెట్టుబడులకు ప్రత్యేక పన్ను మినహాయింపు ఉండదు. పొందిన వడ్డీని వ్యక్తిగత ఆదాయంలో కలిపి, ఉన్న పన్ను శ్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే వడ్డీపై ముందస్తు పన్ను కోత ఉండదు కాబట్టి పెట్టుబడిదారుడికి మొత్తం వడ్డీ నేరుగా అందుతుంది. సురక్షితమైన ఆదాయం, స్థిరమైన రాబడి కోరుకునేవారికి ఈ పథకం ఇప్పటికీ నమ్మదగిన ఎంపికగా కొనసాగుతోంది.



# హోమ్ లోన్ ఈఎంఐ కట్టలేదా?

గృహ రుణం (హోమ్ లోన్) తీసుకున్న తర్వాత అనివార్య కారణాల వల్ల నెలవారీ ఈఎంఐ చెల్లించలేని పరిస్థితి చాలామందికి ఎదురవుతోంది. ఉద్యోగ అనిశ్చితి, వైద్య ఖర్చులు, కుటుంబ ఖర్చుల పెరుగుదల వంటి కారణాలతో ఆర్థిక ఒత్తిడి పెరిగి చెల్లింపులు ఆలస్యం అవుతుంటాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కంగారు పడకుండా సరైన సమయంలో చర్యలు తీసుకుంటే సమస్యను కొంతవరకు నియంత్రించుకోవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈఎంఐ చెల్లింపులు ఆలస్యమైతే ముందుగా చేయాల్సిన ముఖ్యమైన పని బ్యాంకును వెంటనే సంప్రదించడం. పరిస్థితిని దాచిపెట్టకుండా వివరించడంతో బ్యాంకులు రీస్ట్రక్చరింగ్ వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. దీనివల్ల నెలవారీ భారం కొంతవరకు తగ్గించుకోవచ్చు.

### లోన్ రీస్ట్రక్చరింగ్ ఆప్షన్లు

బ్యాంకులు ఆర్థిక పరిస్థితిని బట్టి లోన్ రీస్ట్రక్చరింగ్ అవకాశాలను అందిస్తాయి. రుణ కాలపరిమితిని పెంచడం లేదా కొంతకాలం ఈఎంఐ చెల్లింపులపై తాత్కాలిక ఉపశమనం ఇవ్వడం వంటి మార్పులు చేస్తాయి. దీని ద్వారా నెలవారీ చెల్లింపుల భారం తగ్గి, తిరిగి ఆర్థిక స్థిరత్వం సాధించడానికి సమయం లభిస్తుంది.

### పెండింగ్ ఈఎంఐలకు ప్రాధాన్యం

ఆర్థిక ఇబ్బందుల సమయంలో అనవసర ఖర్చులను తగ్గించి, ముందుగా పెండింగ్‌లో ఉన్న ఈఎంఐలను చెల్లించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. ఆలస్యం పెరిగే కొద్దీ ఆలస్య రుసుములు పెరిగి మొత్తం అప్పు భారం మరింత పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

### మరో అప్పు తీసుకోవడం ప్రమాదకరం

పాత అప్పులు తీర్చడానికి అధిక వడ్డీతో కొత్త అప్పులు తీసుకోవడం సరైన పరిష్కారం కాదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది తాత్కాలిక ఉపశమనం ఇచ్చినా దీర్ఘకాలంలో అప్పుల భారాన్ని మరింత పెంచుతుందని చెబుతున్నారు. ఈ విధానం వ్యక్తిని అప్పుల చక్రంలోకి నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం

ఆర్థిక పరిస్థితి నియంత్రణ తప్పుతుందనిపిస్తే ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఆదాయం, ఖర్చులు, అప్పులను సమీక్షించి సరైన రీపేమెంట్ ప్లాన్ రూపొందించడంలో వారు సహాయపడతారు. బ్యాంకులతో ఎలా చర్చించాలి, దీర్ఘకాలంలో అప్పుల నుంచి ఎలా బయటపడాలనే విషయాల్లో మార్గనిర్దేశం చేస్తారని నిపుణులు చెబుతున్నారు.

ఈ విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటే ఈఎంఐ సమస్యలను కొంతవరకు తగ్గించుకోవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# కృనాల్ బౌలింగ్‌పై కావ్య అసహనం

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో హైదరాబాద్ వేదికగా జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్య వేసిన వింత బౌలింగ్‌పై సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఆర్‌సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడగా.. అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ కూడా భారీ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయితే మ్యాచ్ సందర్భంగా కృనాల్ పాండ్య వేసిన కొన్ని బంతులు ప్రత్యేక చర్చకు దారితీశాయి. సాధారణంగా ఎడమచేతి స్పిన్ బౌలర్ అయిన కృనాల్.. బ్యాటర్లను గందరగోళానికి గురిచేయడానికి అప్పుడప్పుడు భిన్నమైన బంతులు వేస్తుంటాడు. కానీ ఈ మ్యాచ్‌లో అతను వరుసగా బౌన్సర్లు వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేసిన కృనాల్.. నాలుగు నుంచి ఆరు వరకు బౌన్సర్లు సంధించాడు. స్పిన్ బౌలర్ నుంచి ఇలాంటి బంతులు రావడంతో క్రీజులో ఉన్న బ్యాటర్లు కూడా అసౌకర్యానికి గురయ్యారు. వికెట్ కీపర్ జితేష్ శర్మ కూడా కొన్ని బంతులను అందుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. ఈ దృశ్యాలను స్టాండ్స్‌లో నుంచి గమనిస్తున్న కావ్య మారన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన పక్కన ఉన్న వారితో మాట్లాడుతూ "ఇది ఏ బౌలింగ్?" అన్నట్లుగా చేతులూపుతూ అసంతృప్తిని బయటపెట్టారు. ఆమె రియాక్షన్ కెమెరాలో బంధించబడటంతో వీడియో వేగంగా వైరల్ అయింది.

ఆ తర్వాత 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయింది. విరాట్ కోహ్లీ, వెంకటేష్ అయ్యర్ త్వరగా ఔటవ్వడంతో జట్టు ఒత్తిడిలో పడింది. మధ్యలో రజత్ పటీదార్, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్ పోరాడినా ఫలితం లేకపోయింది. చివరకు ఆర్‌సీబీ 200 పరుగులకే పరిమితమవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.






# పంజాబ్‌కు కీలక పోరు.. సెహ్వాగ్ హెచ్చరిక



ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్లేఆఫ్స్ రేసు ఉత్కంఠభరితంగా మారిన వేళ పంజాబ్ కింగ్స్‌కు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరగనున్న మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైతే పంజాబ్ ఆశలు దాదాపు ముగిసే పరిస్థితి ఉండటంతో అభిమానుల్లో టెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పంజాబ్ జట్టుకు కీలక హెచ్చరికలు చేశాడు. సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్.. తర్వాత వరుస పరాజయాలతో ఒత్తిడిలో పడింది. ప్రస్తుతం 13 మ్యాచ్‌ల్లో 13 పాయింట్లతో ఉన్న ఆ జట్టు ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే లక్నోపై తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మ్యాచ్‌లో లక్నో స్టార్ బ్యాటర్ మిచెల్ మార్ష్‌నే ప్రధాన ప్రమాదంగా సెహ్వాగ్ పేర్కొన్నాడు. మార్ష్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని, ముఖ్యంగా పవర్‌ప్లేలో అతడిని అడ్డుకోవడం పంజాబ్ బౌలర్లకు పెద్ద సవాలుగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. పంజాబ్ బౌలింగ్ విభాగంలో మిడిల్ ఓవర్లలో వికెట్లు తీసే స్థిరమైన బౌలర్ లేకపోవడం జట్టుకు బలహీనతగా మారిందని సెహ్వాగ్ విశ్లేషించాడు. సీజన్‌లో గతంలో ఫైనల్ చేరినప్పుడు కూడా పంజాబ్ బౌలింగ్ అంత బలంగా లేదని గుర్తు చేసిన ఆయన.. ఇప్పుడు కూడా అదే సమస్య కొనసాగుతోందని పేర్కొన్నాడు. మార్ష్ లాంటి దూకుడు బ్యాటర్ ఈ బలహీనతను సులభంగా ఉపయోగించుకునే అవకాశముందని హెచ్చరించాడు. ఇక ధర్మశాల మైదానం నుంచి మ్యాచ్ వేదిక మారడం పంజాబ్‌కు కొంత కలిసొచ్చే అంశమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కొత్త పిచ్, కొత్త పరిస్థితులు ఆటగాళ్లలో కొత్త ఉత్సాహాన్ని తీసుకురావొచ్చని చెప్పాడు. ఒత్తిడిలో ఉన్న జట్టుకు వాతావరణ మార్పు కొంత మేలు చేసే అవకాశముందని వివరించాడు. అయితే పంజాబ్ కేవలం ఈ మ్యాచ్ గెలవడం మాత్రమే సరిపోదు. ఇతర జట్ల ఫలితాలు కూడా వారికి అనుకూలంగా రావాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ ఫలితం కూడా కీలకంగా మారనుంది. రాజస్థాన్ ఓడిపోతే పంజాబ్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత బలపడతాయి. సీజన్ ఆరంభంలో చూపించిన ఆటతీరుకు పంజాబ్ ప్లేఆఫ్స్‌కు అర్హమైన జట్టేనని, చివరి పోరులో వారు విజయం సాధించాలని ఆశిస్తున్నట్లు సెహ్వాగ్ పేర్కొన్నాడు.

# ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్త రోర్ ఈవో బైక్ విడుదల



దేశీయ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ మరో సరికొత్త మోడల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. 'రోర్ ఈవో' పేరుతో విడుదల చేసిన ఈ బైక్‌ను ప్రత్యేక ప్రారంభ ధర రూ.99,999కు ప్రవేశపెట్టింది. అయితే ఈ ధర తొలి 10 వేల బుకింగ్‌లకు మాత్రమే వర్తిస్తుందని కంపెనీ స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ బైక్ ధర రూ.1,24,999కు పెరగనుంది. కంపెనీ వివరాల ప్రకారం ఈ బైక్‌లో 3.4 కిలోవాట్ లిథియం ఫెర్రో ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ) బ్యాటరీను ఉపయోగించారు. ఈ బ్యాటరీ ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సుమారు 180 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. అలాగే ఈ బైక్ కేవలం 3 సెకన్లలోనే 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని, గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందని కంపెనీ వెల్లడించింది. ఇంకా ముఖ్యంగా ఈ బైక్ బ్యాటరీ కేవలం 90 నిమిషాల్లో 80 శాతం వరకు ఛార్జ్ అవుతుందని సంస్థ తెలిపింది. ఈ బ్యాటరీకి 8 సంవత్సరాల వారంటీ ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీంతో ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి ఉన్న వినియోగదారులను ఇది ఆకట్టుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సందర్భంగా ఒబెన్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) హర్షవర్ధన్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీకి 5 షోరూమ్‌లు ఉన్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వాటిని 25కి పెంచే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో హైదరాబాద్ వాటా సుమారు 10 శాతంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు.



# పెళ్లి కారణంగా అవకాశం కోల్పోయా: స్రవంతి

గ్లామర్ రంగంలో మహిళల వ్యక్తిగత జీవితం కూడా కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లైందనే కారణంతో ఒక పెద్ద సినిమా అవకాశం కోల్పోయానని ఆమె వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇచ్చానని, నటన, రూపం పరంగా తనను ఎంపిక చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిపింది. ఆ పాత్రకు తానే సరైన ఎంపిక అన్న సంకేతాలు కూడా వచ్చాయని చెప్పింది. అయితే చివరి దశ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు అడిగారని స్రవంతి వెల్లడించింది. "నాకు పెళ్లైందా అని అడిగారు. నేను నిజాయితీగా అవునని చెప్పాను. ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి మారిపోయింది" అని తెలిపింది. ముందుగా షూటింగ్ కోసం చెన్నై రావాలని, అడ్వాన్స్ కూడా ఇస్తామని చెప్పారని గుర్తుచేసుకుంది. కానీ పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేస్తామని చెప్పిన వారు మళ్లీ స్పందించలేదని పేర్కొంది. చివరకు ఆ సినిమా అవకాశం తనకు రాలేదని వెల్లడించింది. తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయిందని స్రవంతి చెప్పుకొచ్చింది. అయితే ఆ సంఘటన తనను మానసికంగా నిరాశపరిచినా, కెరీర్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపింది. కష్టపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ స్థాయిలో గుర్తింపు లభించింది. తర్వాత ప్రముఖ రియాలిటీ కార్యక్రమం బిగ్‌బాస్ నాన్‌స్టాప్‌లో పాల్గొని మరింత పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం సినిమా ఆడియో వేడుకలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ బిజీగా కొనసాగుతోంది. మరోవైపు నటిగానూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో గ్లామరస్ ఫోటోషూట్లతో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది.

# 'లెనిన్' టీజర్‌కు మంచి స్పందన

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా ప్రకటనతో మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రం జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుండగా, చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 సంవత్సరాలు పూర్తయిన ప్రత్యేక సందర్భంగా 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ యాటిట్యూడ్‌లో కనిపించాడు. ముఖ్యంగా ఆయన చెప్పిన సంభాషణలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. "మనోడు వస్తున్నాడుడ", "నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చాడ" వంటి డైలాగులు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. టీజర్‌లో అఖిల్ స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ షాట్లు అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. టీజర్‌పై నాగార్జున కూడా స్పందిస్తూ తనకు ఇది ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని తెలిపారు. మొత్తం టీజర్ ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు కూడా అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచాయి. ఇటీవల వరుస సినిమాలతో ప్రేక్షకులను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్న అఖిల్‌కు 'లెనిన్' చిత్రం ఎంతో కీలకంగా మారింది. గత చిత్రాల ఫలితాల తర్వాత మంచి విజయంతో తిరిగి నిలదొక్కుకోవాలని భావిస్తున్న అఖిల్‌కు ఈ సినిమా మైలురాయిగా మారుతుందా అన్న చర్చ సినీ వర్గాల్లో కొనసాగుతోంది. టీజర్‌ను బట్టి చూస్తే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# 'సలార్ 2'పై ప్రశాంత్ నీల్ క్లారిటీ

రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సలార్ పార్ట్-2' సినిమాపై దర్శకుడు ప్రశాంత్ నీల్ కీలక స్పష్టత ఇచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా ఈ సినిమా ఆగిపోయిందనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజా సమాచారం అభిమానుల్లో మళ్లీ ఉత్సాహాన్ని నింపింది. 'సలార్ పార్ట్-1' విడుదల సమయంలోనే చిత్రబృందం రెండో భాగం కూడా ఉంటుందని ప్రకటించింది. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం భారీ యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగ కథనం, అద్భుత దృశ్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఖాన్సార్ సామ్రాజ్యం నేపథ్యంలో దేవ, వరదరాజ మన్నార్ పాత్రల చుట్టూ నడిచిన కథ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. అయితే ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ మరో భారీ పౌరాణిక చిత్రం తెరకెక్కించబోతున్నారనే వార్తలు రావడంతో 'సలార్ 2' ప్రాజెక్ట్ నిలిచిపోయిందనే అనుమానాలు మొదలయ్యాయి. ఈ ప్రచారం అభిమానుల్లో ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ నీల్ స్పందిస్తూ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' చిత్రం పూర్తయ్యాక వెంటనే 'సలార్ 2' పనులు ప్రారంభిస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో సినిమా పూర్తిగా ఆగిపోలేదని, కేవలం షెడ్యూల్ కారణంగా ఆలస్యం మాత్రమే జరుగుతోందని స్పష్టమైంది. మరోవైపు ప్రభాస్ కూడా వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' రెండో భాగం పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు కొంతవరకు పూర్తయ్యే సమయానికి ప్రశాంత్ నీల్ కూడా తన ప్రస్తుత చిత్రాన్ని పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్లుగా సాగితే 2027 చివరి నాటికి 'సలార్ 2' చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం. మొదటి భాగాన్ని మించిన స్థాయిలో యాక్షన్, భావోద్వేగాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో రెండో భాగాన్ని మరింత భారీగా రూపొందించేందుకు మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'సలార్ 2'పై భారీ అంచనాలు నెలకొని ఉండగా, తాజా స్పష్టతతో ప్రభాస్ అభిమానులు మళ్లీ ఈ ప్రాజెక్ట్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు.



# ఏఐ డీప్‌ఫేక్‌పై రుక్మిణి ఆగ్రహం



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన నకిలీ బికినీ ఫోటోలు, వీడియో క్లిప్స్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. గ్రీన్ కలర్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లో కనిపిస్తున్నట్లు ఉన్న ఆ విజువల్స్ నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీశాయి. చుట్టూ కెమెరాలు, సాంకేతిక సిబ్బంది కనిపించడంతో ఇది ఏదైనా అధికారిక ఫోటోషూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం అవి కృత్రిమ మేధస్సు సాంకేతికతతో తయారు చేసిన డీప్‌ఫేక్ చిత్రాలేమోనని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ వివాదం మరింత వైరల్ కావడంతో తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందించారు. ఇంటర్నెట్‌లో తన పేరిట ప్రచారం అవుతున్న బికినీ ఫోటోలు, వీడియోలు పూర్తిగా కృత్రిమ మేధస్సు సాయంతో తయారు చేసిన నకిలీ చిత్రాలేనని ఆమె స్పష్టం చేశారు. అవి పూర్తిగా తప్పుడు సమాచారం ఆధారంగా సృష్టించబడినవని పేర్కొన్నారు. ఇతరుల వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసేలా ఇలాంటి మార్ఫింగ్ కంటెంట్ తయారు చేయడం, వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన బృందం చాలా సీరియస్‌గా తీసుకుంటోందని రుక్మిణి తెలిపారు. ఈ ఫోటోలను సృష్టించిన వారిపై మాత్రమే కాకుండా, వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై కూడా సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అలాగే నెటిజన్లకు ఆమె ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఎవరూ నమ్మవద్దని, ఇతరులకు షేర్ చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం ఈ ఘటన సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, ప్రముఖులు కూడా డీప్‌ఫేక్ టెక్నాలజీ దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com